RNI : APTEL/25/A0108
# మహి న్యూస్
www.mahinewsindia.com
MAHI NEWS
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 11, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజిలు : 8, వెల రూ. 5, /- మంగళవారం - 14 - ఏప్రిల్ - 2026
published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana

విలేకరులు కావలెను
మహి న్యూస్
ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
-: సంప్రదించండి :-
9059585898

## పోప్ లియోకు క్రైమ్స్ అంటే చాలా ఇష్టం!

- అణ్వాయుధాలను వ్యతిరేకించరు.. నాకు నచ్చలేదు: డొనాల్డ్ ట్రంప్
- అమెరికా- ఇరాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా జరిగిన చర్చలు విఫలం కావడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏం చేయబోతున్నారని పలు దేశాల్లో ఉత్కంఠ నెలకొంది.



అమెరికా- ఇరాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా జరిగిన చర్చలు విఫలం కావడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏం చేయబోతున్నారని పలు దేశాల్లో ఉత్కంఠ నెలకొంది. మిగతా 2లో

## 'ఆధునిక కాలపు హిట్లర్' నెతన్యాహు : టర్కీ

- ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును 'ఆధునిక కాలపు హిట్లర్'గా టర్కీ అభివర్ణించింది.
- టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ వ్యాఖ్యలపై ఇరు దేశాల మధ్య పెరుగుతున్న మాటల యుద్ధంపై టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది.



అంకారా: ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును 'ఆధునిక కాలపు హిట్లర్'గా టర్కీ అభివర్ణించింది. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ వ్యాఖ్యలపై మిగతా 2లో

## రెండు రాష్ట్రాల్లో మార్పు అవసరం

మహిళలకు చట్ట సభల్లో తగిన ప్రాధాన్యత కల్పించే దిశగా 'నారి శక్తి వందనం' చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
ఈ నెల 17, 18 తేదీల్లో పార్లమెంట్‌లో ఈ బిల్లుపై చర్చ జరగనుందని వెల్లడించారు.
దేశంలో మహిళలు సగానికి పైగా ఉన్నప్పటికీ చట్ట సభల్లో వారి ప్రాతినిధ్యం కేవలం 13 శాతమేనని పేర్కొన్నారు.



మహిళలకు చట్ట సభల్లో తగిన ప్రాధాన్యత కల్పించే దిశగా 'నారి శక్తి వందనం' చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో పార్లమెంట్‌లో ఈ బిల్లుపై చర్చ జరగనుందని వెల్లడించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్ పరుశురామరాజు అధ్యక్షతన జరిగిన పత్రికా సమావేశంలో మిగతా 2లో

## పరిశ్రమల స్థాపనలో
# ఇక జెట్ స్పీడ్.

- రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలి
- ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది.
- సోమవారం సచివాలయంలో కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.
- ఈ సందర్భంగా కేంద్రం ప్రతిపాదించిన 'డీ-రెగ్యులేషన్ ఫేజ్-2' అంశాలపై లోతుగా చర్చించారు.
- పరిశ్రమల అనుమతుల కోసం ప్రస్తుతం ఉన్న సంక్లిష్టమైన నిబంధనలను భారీగా తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు
- ప్రస్తుతం అమలులో ఉన్న దాదాపు 800కు పైగా నిబంధనలను వంద లోపునకు కుదించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.
- ప్రభుత్వ పాలనలో వేగం పెంచడానికి టెక్నాలజీని విరివిగా వాడాలని చంద్రబాబు సూచించారు.

**టెక్నాలజీకి పెద్దపీట - ఏఐ వినియోగం**


**మనం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా సాగాలి'**

**'డీ-రెగ్యులేషన్ ఫేజ్-2' అంశాలపై లోతుగా చర్చ**



ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సోమవారం సచివాలయంలో కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రతిపాదించిన 'డీ-రెగ్యులేషన్ ఫేజ్-2' అంశాలపై లోతుగా చర్చించారు. పరిశ్రమల అనుమతుల కోసం ప్రస్తుతం ఉన్న సంక్లిష్టమైన నిబంధనలను భారీగా తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ప్రస్తుతం అమలులో ఉన్న దాదాపు 800కు పైగా నిబంధనలను వంద లోపునకు కుదించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మిగతా 2లో

## అమరావతిలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ షురూ




- రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం రెండో విడత భూ సమీకరణ ప్రక్రియను వేగవంతం చేసింది.
- ఇందులో భాగంగా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో భూముల సమీకరణకు ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది.
- రాజధాని కోర్ ఏరియాకు ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో సుమారు 3,072 ఎకరాల (మొత్తం ప్రతిపాదిత 6,000 ఎకరాల్లో మొదటి విడతగా) భూమిని సేకరించాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది.

రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం మిగతా 2లో

## తండ్రి శవం ఉండగానే.. సీఎం కుర్చీ కోసం
# జగన్ సంతకాలు సేకరించారు

**జగన్‌వి.. శవ రాజకీయాలు.. మంత్రి అచ్చెన్నాయుడు సెటైర్లు**

- వైసీపీ అధినేత జగన్ రాజకీయ శైలిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.
- జగన్‌కు అధికార దాహం ఎక్కువని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన సమయంలో, తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం జగన్ సంతకాలు సేకరించిన చరిత్రను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ఎద్దేవా చేశారు.



వైసీపీ అధినేత జగన్ రాజకీయ శైలిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్‌కు అధికార దాహం ఎక్కువని విమర్శించారు. మిగతా 2లో

## అవి కాకి లెక్కలు..
# అడ్డంగా దొరికిపోయారు

**అమరావతి భూములపై బాబు కాకి లెక్కలు**

- వైఎస్సార్‌సీపీ స్టేట్ కో--ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం
- అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అంటూ మళ్లీ అబద్ధాలు
- కనీస మౌలిక సదుపాయాలకే రూ.2 లక్షల కోట్లు కావాలి
- వడ్డీలకే ఏటా రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు అవుతుంది



అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని, ప్రభుత్వం చేతిలో 5 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ మిగతా 2లో

## లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగంపై దాడి



- లోక్‌సభ లో సీట్ల సంఖ్యను పెంచేందుకు చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ 'రాజ్యాంగంపై దాడి' గా అభివర్ణించారు.
- అదేవిధంగా 'నారీ శక్తి వందన్ అధినియమ్' కు సవరణను ప్రవేశపెట్టిన సమయంపై కేంద్రాన్ని ఆమె ప్రశ్నించారు.

లోక్‌సభ లో సీట్ల సంఖ్యను పెంచేందుకు చేపట్టిన నియోజకవర్గాల మిగతా 2లో

## తక్కువ ధరలకే భూములు కట్టబెట్టడం దారుణం



- తక్కువ ధరలకే భూములు కట్టబెట్టడం దారుణమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని అన్నారు.
- అక్రమ భూకేటాయింపులపై జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులో చర్చాగోష్ఠి నిర్వహించారు.
- ఇందులో పాల్గొన్న పేర్ని నాని మాట్లాడుతూ... చంద్రబాబు ప్రభుత్వం 99 పైసలకే కోట్లాది రూపాయలు విలువచేసే భూములను బడా బాబులకు కట్టబెడుతోందని తెలిపారు. మిగతా 2లో

## సలహాలు ఇవ్వడంపై
# నమ్మకంలేదు

- సలహాలు ఇవ్వడంపై తనకు నమ్మకం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.
- తమిళనాడు లో హీరో విజయ్ టీవీకే పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేస్తున్న వేళ తనను సలహాలు ఇవ్వాలంటూ వచ్చిన అభ్యర్థనపై ఆయన స్పందించారు.
- విజయ్‌కు సలహా ఇవ్వనని, అలాంటి వాటిని తాను అసలు నమ్మనని చెప్పారు. కాగా ఏపీలో హీరో పవన్ కల్యాణ్ కూడా రాజకీయ అడుగులు వేసి
జనసేన పార్టీ స్థాపించి ఇప్పుడు డిప్యూటీ సీఎం అయ్యారు.
- దీంతో సాటి నటుడిగా తమిళనాడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న హీరో విజయ్‌కు సలహాలు, సూచనలు ఇవ్వొచ్చుగా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.
- ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ స్పష్టత ఇచ్చారు. తనకు సలహాలు ఇవ్వడంపై నమ్మకం లేదని ఆయన వ్యాఖ్యానించారు.



సలహాలు ఇవ్వడం పై తనకు నమ్మకం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తమిళనాడు లో హీరో విజయ్ టీవీకే పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేస్తున్న వేళ తనను సలహాలు ఇవ్వాలంటూ వచ్చిన అభ్యర్థనపై ఆయన స్పందించారు. విజయ్‌కు సలహా ఇవ్వనని, అలాంటి వాటిని తాను అసలు నమ్మనని చెప్పారు. కాగా ఏపీలో హీరో పవన్ కల్యాణ్ కూడా రాజకీయ అడుగులు వేసి జనసేన పార్టీ స్థాపించి ఇప్పుడు డిప్యూటీ సీఎం అయ్యారు.
మిగతా 2లో

## మలయాళం సినిమా పేరులా ఉంది



- ఏపీ రాజధానిగా 'మావిగన్' ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అయితే ఆయన ప్రతిపాదనపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది.
- కూటమి నేతలు మూకుమ్మడిగా జగన్‌పై విమర్శల వర్షం కురిపిస్తున్నారు.
- ఇదే విషయంలో వైసీపీ-టీడీపీ, జనసేన, బీజేపీ నేతల మధ్య మాటలయుద్ధం నడుస్తోంది. మిగతా 2లో

## నైజీరియాలో గురి తప్పిన వైమానిక దాడి!

### సంతపై బాంబు - 100 మందికి పైగా మృతి



అబుజా : నైజీరియాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ప్రాంతంలోని యోబే రాష్ట్రంలో ఉగ్రవాదుల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని సైన్యం జరిపిన వైమానిక దాడి విఫలమై, వారపు సంతపై బాంబు పడటంతో 100 మందికి పైగా గ్రామస్థులు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జిలి గ్రామంలో సంత జరుగుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకారం, ఈ దాడిలో 100 మందికి పైగా మరణించగా, రాయిటర్స్ నివేదికల ప్రకారం సంఖ్య 200 దాటినట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. మృతుల్లో మహిళలు, పిల్లలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. నైజీరియా వైమానిక దళం తమ లక్ష్యం ఉగ్రవాదుల స్థావరం, లాజిస్టిక్స్ కేంద్రాలేనని, "ఖచ్చితమైన దాడి" జరిపినట్లు పేర్కొంది. అయితే, ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ మాజీ ఉపాధ్యక్షుడు అటికు అబుబకర్ ఈ దాడిని ఖండిస్తూ, ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈశాన్య నైజీరియాలో బోకో హరామ్, ఐఎస్‌డబ్ల్యూఏపీ వంటి ఉగ్రవాద గ్రూపులపై సైన్యం చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 2017 నుంచి సైన్యం చేసిన దాడుల్లో జరిగిన పొరపాట్ల కారణంగా వందలాది పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ అంచనా వేసింది. ఈ తాజా ఘటనపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది.

## తగ్గేదేలే : అమెరికా ఆంక్షలపై ఇరాన్



టెహ్రాన్: నౌకాదళ ఆంక్షలు విధించాలన్న అమెరికా చర్యను ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రపంచ చమురు వాణిజ్యానికి జీవనాధారమైన హోర్ముజ్ జలసంధి అమెరికా నౌకాదళానికి 'మృత్యు సుడిగుండం'గా మారుతుందని ఇరాన్ సైనిక ప్రతినిధులు తెలిపారు. ఇరాన్ నుంచి చమురు ఎగుమతులను అడ్డుకోవడానికి ట్రంప్ ప్రభుత్వం నౌకాదళ బలగాలను మోహరిస్తుందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఈ విధంగా స్పందించింది. తమ సరిహద్దులను కాపాడుకోవడానికి ఇరాన్ పూర్తిగా సిద్ధంగా ఉందని, అమెరికా చేసే ఎలాంటి రెచ్చగొట్టే చర్యకైనా గట్టిగా ప్రతిస్పందిస్తుందని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచ చమురు సరఫరాలో అధిక భాగం వెళ్లే హోర్ముజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉందని, అక్కడ అమెరికా బలగాలను మోహరించడం ప్రపంచ ఆర్థిక పతనానికి దారితీస్తుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ చమురు ఆదాయాలను పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ట్రంప్ ప్రభుత్వం ఆంక్షలను కఠినతరం చేస్తోంది. ఇందులో భాగంగానే సముద్ర మార్గ సరఫరాలను అడ్డుకోవాలని అమెరికా యోచిస్తోంది. ఇరాన్, అమెరికాల మధ్య తీవ్రమవుతున్న ఈ ఘర్షణ మధ్యప్రాచ్యంలో మరో యుద్ధానికి దారితీసే అవకాశాలను పెంచుతోంది. ఇది ఈ ప్రాంతంలోని ఇతర దేశాలలో కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇదిలా ఉండగా, ఇరాన్ ఓడరేవులపై అమెరికా ఆంక్షల ప్రకటన నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లో చమురు ధరలు పెరిగాయి.

## 'ఆధునిక కాలపు హిట్లర్' నెతన్యాహు : టర్కీ




అంకారా: ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును 'ఆధునిక కాలపు హిట్లర్'గా టర్కీ అభివర్ణించింది. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ వ్యాఖ్యలపై ఇరు దేశాల మధ్య పెరుగుతున్న మాటల యుద్ధంపై టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిల్ సైనిక చర్యలను, పాలస్తీనా సమస్యపై దాని వైఖరిని ఎర్డోగాన్ తీవ్రంగా విమర్శిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ప్రభుత్వం ముందుకు రావడంతో ఈ వివాదం మరింత తీవ్రమైంది. ఎర్డోగాన్‌పై ఇజ్రాయిల్ చేసిన విమర్శలకు ప్రతిస్పందనగా, టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ నెతన్యాహును నాజీ నియంత హిట్లర్‌తో పోల్చింది. గాజా మరియు మధ్యప్రాచ్యంలో జరిగిన మారణకాండలకు నెతన్యాహు సమాధానం చెప్పాల్సి ఉంటుందని కూడా టర్కీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎర్డోగాన్ వ్యాఖ్యలు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నాయని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఇజ్రాయిల్ విమర్శించింది. ఈ ప్రాంతంలో శాంతి ప్రయత్నాలను టర్కీ దెబ్బతీస్తోందని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఒకప్పుడు సన్నిహిత రక్షణ, ఆర్థిక సంబంధాలను కలిగి ఉన్న టర్కీ -- ఇజ్రాయిల్ మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో తీవ్రంగా దిగజారాయి. పాలస్తీనా సమస్యపై ఎర్డోగాన్ తీసుకున్న కఠిన వైఖరి మధ్యప్రాచ్య దేశాలలో టర్కీకి పలుకుబడిని పెంచినప్పటికీ, అది ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను పూర్తిగా దెబ్బతీసింది. ఈ మాటల యుద్ధం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచుతూ, మధ్యప్రాచ్య రాజకీయాలను మరింత సంక్లిష్టతరం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## తూర్పు పసిఫిక్‌లో అక్రమ మాదకద్రవ్యాల పడవలపై అమెరికా దాడి : ఐదుగురు మృతి



వాషింగ్టన్ : తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్నాయనే ఆరోపణలపై అమెరికా సైన్యం రెండు పడవలను బాంబులతో పేల్చేసింది. దీంతో పడవలో ఉన్న ఐదుగురు మృతి చెందారు. ఒకరు ప్రాణాలతో బయటపడ్డారు అని అమెరికా సైన్యం ఆదివారం వెల్లడించింది. ట్రంప్ ప్రభుత్వం ఒకవైపు అక్రమ మాదక ద్రవ్యాల రవాణా నౌకలపై దాడులు చేస్తూనే.. మరోవైపు ఇరాన్ ఓడరేవులపై నావికా దిగ్బంధనానికి సన్నాహాలు చేస్తోంది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి అమెరికా నార్కో టెర్రరిస్టులపై దృష్టి పెట్టింది. అక్రమ మాదక ద్రవ్యాల్ని రవాణా చేసేవారికి లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. ఇప్పటివరకు అమెరికా దాడుల్లో 168 మంది మృతి చెందారు. అక్రమ మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టడానికి తూర్పు పసిఫిక్, కరేబియన్ సముద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. అయితే తాజాగా పేల్చేసిన పడవల్లో మత్తుపదార్థాలు ఉన్నాయనడానికి అమెరికా సైన్యం వద్ద ఎలాంటి ఆధారాలు లేవు.

# విస్తరిస్తున్న ప్రచండ వేసవి

### ముందే వస్తోంది.. నెమ్మదిగా వెళ్తోంది

### గత 60 ఏళ్లలో వేసవికాలం నిడివి 30 రోజులు పెరిగింది

### కొన్ని నగరాల్లో మరింత ఎక్కువగా పెరుగుతోంది

### బ్రిటీష్ కొలంబియా విశ్వవిద్యాలయ తాజా పరిశోధనలో వెల్లడి



స్పెషల్ డెస్క్: వేసవి వేడి తీవ్రత పెరగటమే కాదు.. వేసవికాలం కూడా ఏటేటా పెరుగుతోంది. మాడు పగిలే ఎండల రోజులు ఏటేటా ముందుగానే ప్రారంభమై, ఆలస్యంగా ముగుస్తూ, మరింత తీవ్రంగా మారుతున్నాయి. వేసవి రోజుల సంఖ్య 1960 నాటి కంటే 2023 మధ్యలో సుమారు 30 రోజులు పెరి గిందని కెనడాలోని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం నిర్వహించిన తాజా పరిశోధనలో వెల్లడైంది. భూమధ్య రేఖ కు దగ్గరి దేశాల్లో 6 దశాబ్దాల క్రితంతో పోలిస్తే వేసవి కాలాలు ముందుగానే కాక మరింత ఆకస్మికంగా వస్తున్నాయని, ఎక్కు వ కాలం కొనసాగుతున్నాయని, వేడితీవ్రత ఏటేటా మరింత పెరుగుతోందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. వాతావరణంలో వేగవంతమైన మార్పులు చోటుచేసుకోవటం వల్ల ప్రతికూల పరిస్థితులకు అనుగుణంగా మారే శారీరక సామర్థ్యాన్ని ఇది దెబ్బతీస్తోంది.

### 1990 తర్వాత ఎక్కువ

ఈ తాజా అధ్యయనం వివరాలు 'ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్ లెటర్స్'లో ప్రచురితమయ్యాయి. వేసవి రోజుల సంఖ్య తొలుత భూమిపై పెరిగాయి. ఆ తర్వాత సముద్రంలోనూ పెరిగాయి. 1961--2023 మధ్యకాలంలో, మధ్య అక్షాంశాలలోని భూభాగాలు, తీర ప్రాంతాలు, సముద్రాల్లో ప్రతి సంవత్సరం వేసవికాల వ్యవధి పెరిగింది. తొలి 3 దశాబ్దాల కంటే ఆ తర్వాత మరింత పెరిగింది. 1990--2023 మధ్యలో వేసవి కాలం నిడివి పెరుగుదల సగటు రేటు సుమారుగా దశాబ్దానికి ఆరు రోజులు. అంటే.. 1990తో పోలిస్తే 2023లో వేసవి సుమారు 20 రోజులు ఎక్కువ.

### కొన్ని నగరాల్లో మరీ ఎక్కువ

వేసవికాలం కొన్ని నగరాల్లో సంవత్సరానికి ఒక రోజు కంటే ఎక్కువగా పెరుగుతోంది. ఉదాహరణకు సిడ్నీ (ఆస్ట్రేలియా)లో ప్రతి దశాబ్దానికి వేసవికాలం 14.8 రోజుల చొప్పున పెరుగుతోంది. అంటే 1990లో 80 రోజులుగా ఉన్న వేసవికాలం ఇప్పుడు సుమారు 130 రోజులకు చేరుకుంది. మిన్నియాపాలిస్ (అమెరికా)లో ప్రతి దశాబ్దానికి 9.3 రోజులు, టొరంటో (కెనడా)లో 8 రోజులు పెరుగుతోంది. వేసవిలో వేడి అంతకంతకూ పెరగడం వల్ల మధ్య అక్షాంశ దేశాల్లోని మనుషుల్లో వేడికి తట్టుకునే శారీరక సామర్థ్యం క్షీణించొచ్చు. పగలు, రాత్రి వేళల్లో శరీరాన్ని చల్లబరచుకోవడానికి మరింత శక్తి అవసరం కావొచ్చని అధ్యయనం పేర్కొంది. ఈ పెరిగే వేసవి తీవ్రత ప్రతికూల ప్రభావం పంటలపై కూడా ఉంటుంది. వసంతకాలం నుంచి వేసవికి, వేసవి నుంచి శరదృతువుకు వాతావరణం మారే దశల్లో వేగం పెరిగింది. దీంతో, వేసవి వేడి తీవ్రత కూడా పెరుగుతుందని ఈ అధ్యయనం పేర్కొంది. ఈ మార్పులపై ఆధారపడిన వ్యవస్థలకు సర్దుబాటు చేసుకోవడానికి సమయం తక్కువగా ఉంటుందని పరిశోధకులు తెలిపారు. ప్రజలు అధిక ఉష్ణోగ్రతలకు ఇంకా అలవాటు పడని సీజన్ ప్రారంభ రోజుల్లోనే ప్రాణాంతకమైన వడగాలులకు దారితీయొచ్చని హెచ్చరిస్తున్నారు.

# చర్చల వైఫల్యం వెనక... ఐదు కారణాలు!





అమెరికా, ఇరాన్ నడుమ ఎంతో ఆశావహంగా మొదలైన శాంతి చర్చలు విఫలం కావడం అంతర్జాతీయ సమాజాన్ని తీవ్ర నిరాశలో ముంచెత్తింది. ఈ వైఫల్యం వెనక పలు కారణాలున్నట్టు అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వాటిలో ప్రధానమైనవి... 1. అటు అమెరికా, ఇటు ఇరాన్ తమ ప్రాధాన్యాలకే కట్టుబడి ఉండాలనే మొండి పట్టుదలతో ఇస్లామాబాద్‌లో అడుగుపెట్టాయి. ఎవరూ తమ డిమాండ్ల నుంచి ఇసుమంతైనా వెనక్కు తగ్గలేదు. అవతలి వారి వాదనలకు ఏ మాత్రమూ విలువ ఇవ్వలేదు. చర్చలు వైఫల్యానికి ఈ వైఖరే ప్రధాన కారణంగా నిలిచింది. యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని తక్షణం, శాశ్వతంగా ఆపేయాలని అమెరికా డిమాండ్‌కు ఇరాన్ ససేమిరా అంది. విద్యుదుత్పత్తి అవసరాల నిమిత్తం యురేనియం శు ద్ధి కార్యక్రమాన్ని కొనసాగించి తీరతామని కరాఖండిగా చెప్పింది. 2. చర్చలన్నాక అగ్రరాజ్యాధినేత అయినా నోరు అదుపులో పెట్టుకోవాలి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ దౌత్యధర్మాన్ని పూర్తిగా విస్మరించారు. ఇరాన్ బృందం పాక్‌లో కాలుమోపాక కూడా కాక పెంచేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దిగారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మునుపెన్నడూ ఉపయోగించని శక్తిమంతమైన ఆయుధాలతో మరింత భీకరంగా విరుచుకుపడతామంటూ ఆయన పెట్టిన పోస్టులు పరిస్థితిని దిగజార్చాయి. ఓవైపు చర్చలకు పిలిచి మరోవైపు ఇలా బెదిరింపులకు పాల్పడటం ఏ రకమైన దౌత్య నీతి అంటూ అమెరికా ప్రతినిధులను ఇరాన్ బృందం నిలదీసినట్లు సమాచారం. 3. కాల్పుల విరమణ లెబనాన్‌కూ వర్తిస్తుందని తాము మొదటి నుంచీ చెబుతున్నా చర్చలను బేఖాతరు చేస్తూ ఆ దేశంపై ఇజ్రాయెల్ భీకరంగా దాడులు కొనసాగిస్తుండటం ఇరాన్‌కు సుతరామూ నచ్చలేదు. లెబనాన్‌పై దాడులు చేయకుండా ఇజ్రాయెల్‌ను నిరోధిస్తామని అమెరికా నుంచి ఎలాంటి హామీ రాకపోవడాన్ని ఇరాన్ తీవ్రంగా తప్పుబట్టింది. మధ్యవర్తిగా హుందాగా వ్యవహరించాల్సిన పాక్ కూడా పరిస్థితిని దిగజార్చేలా ప్రవర్తించింది. ఇజ్రాయెల్ జాతి హననానికి పాల్పడుతోందంటూ పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ పోస్టు పెట్టడంతో మండిపడ్డ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ మరింతగా రెచ్చగొట్టే వ్యాఖ్యలుచేశారు. చర్చలతో తమ దాడులకు సంబంధం లేదంటూ కుండబద్దలు కొట్టారు. 4. అంతర్జాతీయ ఇంధన రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధిని బేషరతుగా తెరవాలని ట్రంప్ డిమాండ్‌చేశారు. షరతుల్లేకుండా దాన్ని తెరవబోమని, చర్చల్లో బేరసారాలకు హోర్ముజ్ తమకు కీలక ఆయుధమని ఇరాన్ ప్రతినిధులు వాదించారు. హోర్ముజ్‌ను తెరవకపోతే ఇరాన్ నాగరికతనే బూడిద చేస్తామన్న ట్రంప్ బెదిరింపులను తీవ్రంగా తప్పుబట్టారు. హోర్ముజ్‌ను తెరవాలంటే ఇరాన్‌పై ఆంక్షలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇందుకు అమెరికా బృందం ఒప్పుకోలేదు. పైగా ఈ విషయంలో ట్రంప్ ధోరణినే గట్టిగా సమరి?థంచింది. హోర్ముజ్ గుండా పయనించే నౌకల నుంచి చార్జీలు వసూలుకు ఇరాన్‌తో కలిసి టోల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్న ట్రంప్ ప్రతిపాదనలను ఇరాన్ అంగీకరించలేదు. హోర్ముజ్‌పై తమతో పాటు ఒమన్ పాక్షిక అధికారాలను గుర్తించాలన్న ఇరాన్ డిమాండ్‌కు అమెరికా ఒప్పుకోలేదు. 5. అమెరికా, ఇరాన్ బృందాల మధ్య పరస్పర విశ్వాస లోపం అడుగడుగునా కనిపించింది. హామీలను అవతలి పక్షం పాటిస్తాయా అన్న అనుమానాలు ఇరువైపులా కొట్టొచ్చి?చనట్టు కన్పించాయి. తమ ప్రతిపాదనలు అద్భుతమని అమెరికా చెప్పుకుంటే, అవన్నీ చెత్త షరతులని ఇరాన్ ప్రతినిధులు కుండబద్దలు కొట్టారు.

### ఇక ఏం జరగనుంది?

చర్చల వైఫల్యం తాలూకు తక్షణ ప్రభావం కాల్పుల విరమణపై పడే అవకాశముంది. అమెరికా, ఇజ్రాయెల్ మళ్లీ ఇరాన్‌పై మూకుమ్మడిగా దాడులు ప్రారంభించే ప్రమాదం కన్పిస్తోంది. చర్చలు విఫలమైతే చరిత్ర చూడని స్థాయిలో ఇరాన్‌పై దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే హెచ్చరించడం తెలిసిందే. అదే జరిగితే ప్రాణ, ఆస్తినష్టం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించడం కూడా కష్టమేనని ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధి తెరచుకోని పక్షంలో అంతర్జాతీయంగా చమురు సంక్షోభం ముదిరే ఆస్కారముంది. తమ వద్ద అణుబాంబు లేని కారణంగానే అమెరికా ఇంతగా దాడులకు దిగుతోందన్న అభిప్రాయంతో ఉన్న ఇరాన్, ఇక అణ్వస్త్ర కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన కొనసాగించే వీలుంది. భారత్‌లో ఇంధన కష్టాలు మరింత పెరిగే అవకాశముంది.

# 'తాత్కాలిక సంధి' దశ!



నలభై రోజులుగా ఇరాన్ పౌరుల్ని భీతావహుల్ని చేస్తూ, ప్రపంచాన్ని సైతం అల్లకల్లోల పరుస్తున్న యుద్ధం తాత్కాలికంగా నిలిచింది. రెండు వారాలపాటు కాల్పుల విరమణ పాటించటానికి అమెరికా, ఇరాన్‌లు అంగీకరించటంతోపాటు దాన్ని పూర్తిస్థాయి విరమణగా మార్చటానికి వీలుగా పరస్పరం చర్చించుకోవాలని నిర్ణయించాయి. పాకిస్తాన్ దౌత్యం వల్లే అంతా సాధ్యపడినట్టు కనిపిస్తున్నా ఇరాన్‌ను బలంగా ప్రభావితం చేయగల చైనా జోక్యమే ఫలించిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాటలు చూస్తే అర్థమవుతుంది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ఇరుపక్షాల మధ్యా శుక్రవారం జరగబోయే చర్చల ఫలితం ఎలా ఉండబోతుందో అంచనా వేయటం అంత సులభం కాదు. ఎందుకంటే, చర్చలకు ప్రాతిపదికగా అమెరికా విడుదల చేసిన 15 అంశాలకూ, ఇరాన్ ప్రతిపాదిస్తున్న 10 అంశాలకూ మధ్య చాలా విషయాల్లో పొసగటం లేదు. భూమిలో పాతిపెట్టిన 60 శాతం శుద్ధిచేసిన 440.9 గ్రాముల యురేనియంను ఇరాన్ తవ్వి తీయాల్సిందేనని అమెరికా కోరుతుండగా, ఆ విషయంలో రాజీపడబోమంటున్నది ఇరాన్. తమపై ఇన్నేళ్లుగా విధిస్తూవచ్చిన మౌలిక ఆంక్షలనూ, సెకండరీ ఆంక్షలనూ ఎత్తి వేయాలనీ, పశ్చిమాసియా నుంచి అమెరికా సేనలు వైదొలగాలనీ, స్తంభింపజేసిన తమ ఆస్తుల్ని వెనక్కివ్వాలనీ, శాంతి ఒప్పందానికి భద్రతామండలి గ్యారెంటీ ఉండాలనీ ఇరాన్ కోరుతోంది. కాల్పుల విరమణలో లెబనాన్‌పై దాడుల్ని నిలిపేయటం భాగమని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెబుతుండగా, అమెరికా తాజా వైఖరిని అంగీక రిస్తూనే ఇజ్రాయెల్ ఆ దాడులు ఆగబోవంటున్నది. రెండుపక్షాల మధ్య అభిప్రాయ భేదాలు రావటం, అవి ఘర్షణలకు దారితీయటం అసాధారణమేమీ కాదు. ఆ ఘర్షణలు తెచ్చే తీవ్ర ఉద్రిక్తతల వల్ల సంధి కుదరటం ఓ పట్టాన సాధ్యపడదు. కాల్పుల విరమణ ప్రకటన వెలువడి ఏడెనిమిది గంటలు గడిచినా పశ్చిమాసియాలో క్షిపణి దాడులు, బాంబుల మోతలు ఆగకపోవటం ఇందుకు తార్కాణం. కొన్ని దేశాలు మధ్యవర్తి పాత్ర పోషిస్తేనే, ఘర్షణల్లోని నిరర్థకతను వైరి దేశాలకు గుర్తుచేసి ఒప్పిస్తేనే ఆ దిశగా అడుగులు పడతాయి. కానీ ఈసారి అందుకు భిన్నంగా జరిగింది. పెను మారణహోమాన్ని సృష్టిస్తాననీ, ఇరాన్ నాగరికత మొత్తాన్ని తుడిచిపెట్టేస్తాననీ ట్రంప్ చేసిన హెచ్చరిక చర్చలకు దారులు పరిచింది. యుద్ధనేరాల్లో అగ్రభాగాన ఉండే 'మారణహోమం' బెదిరింపు చర్చల సాధనంగా మారటం అత్యంత ప్రమాదకర పరిణామం. ఇవాళ ఇరాన్‌కి ఎదురైన పరిస్థితే రేపన్నరోజు వేరే దేశాలకూ ఎదురుకావొచ్చు. తాను వేరే దేశాధ్యక్షుణ్ణి అపహరించవచ్చు... కానీ ఇరాన్ మాత్రం ఆత్మరక్షణకు ఎలాంటి చర్యలూ తీసుకోకూడదన్నది ట్రంప్ నీతి. అమెరికాతో దాదాపు సమవుజ్జీలుగా ఉండి కూడా చైనా, రష్యాలు అమెరికా వైఖరిని నిర్ద్వంద్వంగా ఖండించలేకపోయాయి. భద్రతా మండలిలో ఒత్తిడి చేయలేకపోయాయి. ఉక్రెయిన్ చేస్తున్న దాడులకు అమెరికా సాయం చేస్తున్నది గనుక తాము ఇరాన్‌కు సహకరిస్తున్నామని మాత్రం రష్యా చెప్పింది. బాధిత దేశంగా తనను తాను చిత్రించుకుంటూ రెండేళ్ల పాటు గాజాను ఇజ్రాయెల్ వల్లకాడు చేస్తున్నా నోరు మెదపని దేశాలు...

ఇరాన్ విషయంలోనూ మౌన ప్రేక్షకులుగా మిగిలిపోయాయి. అన్ని మర్యాదలూ మంటగలిపి, మతి చలించినట్టు ప్రవర్తిస్తున్న ట్రంప్ ఇరాన్‌పై అణ్వస్త్ర దాడికి తెగబడతారన్న భయంతోనే చివరి నిమిషంలో చైనా కదిలింది. అది నచ్చజెప్పనట్టయితే ఇరాన్ అంగుళమైనా వెనక్కి తగ్గేది కాదు. కాల్పుల విరమణ కోసం ఇరాన్ తమను ప్రాథేయపడిందని అమెరికా యుద్ధశాఖ మంత్రి పీట్ హెగ్సెత్ స్వోత్కర్షకు పోతున్నారు. ట్రంప్ ఇరాన్ విషయంలో చాలా అసహనంగా ఉన్నారని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అంటున్నారు. కానీ ట్రిగ్గర్‌పైన వేళ్లతోనే ఈ ఒడంబడికకు సిద్ధపడ్డామనీ, శత్రువు వైపు చిన్న పొరపాటు జరిగినా సర్వశక్తులూ ఒడ్డి ప్రతిఘటిస్తామనీ ఇరాన్ ప్రకటించింది. కనుక ఈ స్వల్పకాల శాంతిపై ఎవరూ భరోసా పెట్టుకోనవసరం లేదు. ఏ క్షణంలోనైనా అది నీటి బుడగలా మటుమాయం కావొచ్చు. ఇంటా బయటా పెద్ద వినాశకారిగా పరిణమించిన ట్రంప్‌ను అభిశంసన ద్వారా అమెరికా సాగనంపే వరకూ శాంతి, సంధి వంటివి క్షణభంగురాలు!

## క్వాంటం రిఫరెన్స్ సెంటర్ ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 13 : దేశంలోనే మొట్టమొదటి క్వాంటం రిఫరెన్స్ సెంటర్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ సోమవారం పరిశీలించారు. ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ వేదికగా ఈ కార్యక్రమాన్ని అమరావతి క్వాంటం వ్యాలీ సౌజన్యంతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ విక్రమ్ సారాభాయ్ బ్లాక్ లో క్వాంటమ్ హార్డ్ వేర్ టెస్ట్ బెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంది. విక్రమ్ సారాభాయ్ బ్లాక్ లో క్వాంటం రిఫరెన్స్ సెంటర్ ప్రారంభోత్సవం అనంతరం ఎస్.ఆర్.ఎం ఆడిటోరియంలో జరిగే సభా కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఈ రెండు వేదికలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వినాయక్, తెనాలి ఇన్ ఛార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, మంగళగిరి తహసీల్దార్ దినేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

### ఎమ్మెల్యే కూన రవికుమార్




పొందూరు, మహి న్యూస్, ఏప్రిల్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న ఆధునిక వసతులను ప్రజల్లోకి తీసుకెళ్లి, అడ్మిషన్ల శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ శ్రీ కూన రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పొందూరు పట్టణంలోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో అడ్మిషన్ల పెంపు, నూతన విద్యా విధానంపై నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో ప్రైవేటుకు దీటుగా ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ విద్యాబోధన, అత్యాధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయాలి

శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 13: నగరంలోని స్టేడియం రోడ్డులో ఉన్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం (ఏప్రిల్ 14న) ఉదయం 10.00 గంటలకు ఆయన 135వ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పుష్పమాలాంకరణ చేసి నివాళులర్పిస్తారని, అనంతరం అంబేద్కర్ ఆడిటోరియంలో సభా కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ సంఘాల నాయకులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## భూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 13: పోలాకి మండలం తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న భూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. పోలాకి మండలం తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న అటవీ భూముల సమస్య వలన మత్స్యకారుల ఇబ్బందులు పడుతున్నట్లు నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి జెసి దృష్టికి తీసుకు వచ్చారు. దీని వలన మత్స్యకారులు గృహ నిర్మాణాలకు, కమ్యూనిటీ స్థలాలను అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం లేకుండా పోతోందన్నారు. ఈ విషయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా శాసన సభ్యులు జిల్లా జాయింట్ కలెక్టర్ రెవెన్యూ, అటవీ అధికారుల సమక్షంలో గ్రామస్తులతో చర్చించి సమస్య పరిష్కారం పట్ల కృషి చేస్తానని జాయింట్ కలెక్టర్ శాసన సభ్యులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు కె. సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ నెల్లూరు ఎందుకు వస్తున్నారో సమాధానం చెప్పాలి

### జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పై వైసీపీ నీచ రాజకీయం సిగ్గుచేటు

ప్రకాశం / తూర్పునాయుడుపాలెం, మహి న్యూస్, ఏప్రిల్ 13 : రేపు జగన్ నెల్లూరు పర్యటనకు ఎందుకు వస్తున్నారో సమాధానం చెప్పాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రశ్నించారు. సోమవారం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.... జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పై వైసీపీ నీచ రాజకీయం సిగ్గుచేటు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు ద్వారా దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ యార్డ్ గా జువ్వలదిన్నె అభివృద్ధి చెందబోతోంది. దేశీయ రక్షణ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం, దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాల అభివృద్ధికి రూ.45 కోట్ల పెట్టుబడితో వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించనున్నాం. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్ మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా బ్లూ ఎకానమీ, మారిటైం ఇన్నోవేషన్ ను బలోపేతం చేయడంతో పాటు ఏపీని మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్ గా నిలవనుంది. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ను రూ.288.80 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేశాం. ఈ హార్బర్ ల్యాండింగ్ ప్లాట్ఫామ్లు, వేలం హాళ్లు, వలల మరమ్మతు యార్డు, అంతర్గత రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయంతో పాటు చేపల నిర్వహణ వంటి ఆధునిక మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నాం. హార్బర్ నిర్మాణం ద్వారా 25వేల మత్స్యకార కుటుంబాల జీవితాలు సమూలంగా మారబోతున్నాయి. 1,250 మెకనైజ్డ్, మోటరైజ్డ్ చేపల పడవలను సురక్షితంగా నిలిపేలా సదుపాయం కల్పించాం. ప్రతి ఏడాది ఈ హార్బర్ ద్వారా 41 వేల టన్నుల చేపలు దిగుబడి చేసే అవకాశం ఉంది. పోర్టులో కొత్త నిర్మాణాలు లేకుండా నాడు వైఎస్ అడ్డగోలుగా జీవోలిచ్చి కృష్ణపట్నం పోర్టు అభివృద్ధిని అడ్డుకున్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక ఆ జీఓలన్నీ రద్దు చేసి పోర్టు, హార్బర్ నిర్మాణాలకు మార్గం సుగమం చేశారు. మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. సీఎం చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు అన్ని విధాలా అండగా ఉంటారు. వైసీపీని ప్రజలు 11 కి పరిమితం చేసినా నీచ రాజకీయాలు మానలేదని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## శ్రీరామం నేత్రాలు దానం



తాళ్లరేవు, మహి న్యూస్ ఏప్రిల్ 13: మండల కేంద్రమైన తాళ్లరేవు గ్రామానికి చెందిన పుప్పాల శ్రీరామం (70) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. లయన్స్ ప్రతినిధులు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించడంతో ఆయన భార్య, కుటుంబసభ్యుల అంగీకారం మేరకు శ్రీరామం నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేసారు. ఐ బ్యాంకు టెక్నీషియన్స్ రవి, నానిలు శ్రీరామం నేత్రాల కార్నియాలను సేకరించారు. అంతటి విషాద సమయంలోనూ నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను పుప్పాల రెడ్డినాయుడు, కృష్ణమూర్తి, సీతాపతిరావు, జనార్దన్, నరసింహం, సతీష్, నల్లం వేణు, నూకల వెంకట్రాయుడు. విళ్ల వెంకటేశ్వరరావు. గోనెమడతల రవి. ఏడిద తాతీలు, వాసు తదితరులు అభినందించారు.

## నేరేడి బ్యారేజీ నిర్మాణం.. చరిత్రలో నిలిచిపోయే ఘట్టం!




కోటబొమ్మాళి, మహి న్యూస్, ఏప్రిల్ 13 : ఉత్తరాంధ్ర రైతాంగ దశాబ్దాల కల అయిన నేరేడి బ్యారేజీ నిర్మాణం చరిత్రలో నిలిచిపోయేలా సాకారం కాబోతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సుమారు 50 ఏళ్ల ఆరాటానికి ఎట్టకేలకు మోక్షం లభించిందని, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ఆయన ఉద్ఘాటించారు. నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో నందిగాం మండల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు.

### ఎర్రన్నాయుడు ఆశయం.. కూటమి ప్రభుత్వ లక్ష్యం

నేరేడి బ్యారేజీ నిర్మాణం దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు కల అని, ఆ ఆశయాన్ని నెరవేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అచ్చెన్నాయుడు భావోద్వేగంతో పేర్కొన్నారు. నేరేడి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడం ఒక చారిత్రాత్మక విజయం. ఇందుకోసం తాను, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర పెద్దలతో నిరంతరాయంగా సంప్రదింపులు జరిపారు. ఆ కృషి ఫలితంగానే నేడు సమస్య పరిష్కార దిశగా అడుగులు పడ్డాయని తెలిపారు. ప్రాజెక్టు పనుల కోసం ప్రాథమికంగా రూ.60 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. 2010లో ట్రిబ్యునల్ ఏర్పాటుతో పరిష్కారం మొదలైతే, 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతం చేశారని గుర్తు చేశారు. ప్రతిష్టాత్మకమైన ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు గతంలో రూ.450 కోట్లు మంజూరై పనులు శరవేగంగా సాగాయని, కానీ గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికొదిలేసిందని ఆరోపించారు. సాగునీటి రంగానికి కూటమి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. నేరేడితో పాటు ఆఫ్‌షోర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిన్నరలో ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే, జిల్లా రైతాంగం ఏడాదికి రెండు మూడు పంటలు పండించుకునే వెసులుబాటు కలుగుతుందని, శ్రీకాకుళం జిల్లా అన్నపూర్ణగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ రూఫ్ టాప్ యూనిట్లతో అందరికీ ఉపయోగం

### ఛార్జీలు తగ్గాలంటే పునరుత్పాదక విద్యుత్తే ప్రత్యామ్నాయం




దర్శి, మహి న్యూస్ ఏప్రిల్ 13: రోజు రోజుకూ పెరుగుతున్న కరెంట్ వాడకం, పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు, ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రజలందరూ సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం, దొనకొండ మండలంలోని మల్లంపేట కాలనీలో మంత్రి గొట్టిపాటి సోమవారం నాడు పర్యటించారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా గ్రామంలోని 44 ఎస్సీ కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల వినియోగాన్ని పెంచుకోవాలని ప్రజలకు సూచించారు. సబ్సిడీతో కూడిన సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం ఉంటుందని అన్నారు. మనం వాడుకునే విద్యుత్ ను మన ఇంటిపైనే ఉత్పత్తి చేసుకునే అవకాశం సోలార్ రూఫ్ టాప్ లో ఉందని వివరించారు. ఒక్కో సోలార్ ప్లాంట్ తో సుమారు 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు. దర్శి నియోజకవర్గంలో పీఎం సూర్యఘర్ అమలు కోసం రూ.50.39 కోట్ల నిధులను కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోలార్ కనెక్షన్ తీసుకునే బీసీలకు రూ.98 వేలు, ఓసీలకు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తున్నామని ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారాలు వేసిందని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రూపాయి విద్యుత్ ఛార్జీ పెంచకుండానే 13 పైసలు ట్రూ డౌన్ చేసిందన్నారు. రాబోయే కాలంలో విద్యుత్ ఛార్జీలను మరింత తగ్గించే లక్ష్యంతో అనేక చర్యలు చేపడుతున్నామని మంత్రి చెప్పారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పాలుట్ల అటవీ ప్రాంతంలో నివసించే 611 ఎస్టీ కుటుంబాలకు సోలార్, బ్యాటరీ స్టోరేజ్ యూనిట్లను ఉచితంగా అందించామని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో విద్యుత్ లేని గ్రామాలు ఉండకూడదన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల్లో పాలుట్ల తండా వాసులకు మొదటిసారి విద్యుత్ వెలుగులు అందించడం గొప్ప విషయమన్నారు. తండాలు ఉండే ప్రాంతంలో విద్యుత్ లైన్లు వేయడానికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో రాత్రి సమయాల్లోనూ ఉపయోగపడేలా సోలార్, బ్యాటరీ యూనిట్లను వారికి అందించామన్నారు. దేశవ్యాప్తంగా కోటి సోలార్ కనెక్షన్లకు ప్రధాని మోడీ అనుమతులు ఇస్తే., అందులో 20 లక్షలు ఆంధ్రప్రదేశ్ కే కేటాయించారని మంత్రి గొట్టిపాటి గర్వంగా చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.8 వేల కోట్ల ఆర్డీఎస్ఎస్ నిధులతో కొత్త విద్యుత్ లైన్లు, స్తంభాలు ఏర్పాటు, మౌలిక వసతులు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దర్శి నియోజకవర్గంలో ఆర్డీఎస్ఎస్ పనుల కోసం రూ.147 కోట్లు మంజూరు చేశామని., ఇందులో రూ.115 కోట్లకు సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయన్నారు. పీఎం కుసుమ్ ద్వారా వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల సౌర విద్యుత్ ను సరఫరా చేస్తామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. పీఎం కుసుమ్ పనులు త్వరలోనే ప్రారభం అవుతాయన్నారు. 11 కేవీ లైన్లకు దగ్గరగా పీఎం కుసుమ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోతే ప్రైవేటు భూములను కౌలుకు తీసుకుని అయినా పీఎం కుసుమ్ సోలార్ ప్లాంట్లను వచ్చే ఏడాదే ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ కనెక్షన్లను ప్రాధాన్యతా క్రమంలో ఇస్తున్నామని తెలిపారు. పెండింగ్ లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లను వ్యవసాయ సీజన్ ప్రారంభం నాటికి ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. లో ఓల్టేజ్, అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా కోసం సబ్ స్టేషన్ల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో వెలిగొండ ప్రాజెక్ట్ కు రూ.500 కోట్లు కేటాయించి పనులు చేయిస్తున్నారని స్పష్టం చేశారు. అదే విధంగా ఆర్థిక వెసులుబాటును బట్టి కొత్త పెన్షన్ల మంజూరుతో పాటు అవసరమైన వారికి ఇళ్లను కూడా కేటాయిస్తామని మంత్రి గొట్టిపాటి భరోసా ఇచ్చారు. అందరికీ సంక్షేమం అమలు చేస్తూ., రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు కూడా గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారశెట్టి పాపారావుతో పాటు లబ్ధిదారులు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

### మల్లంపేట పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి....

మల్లంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.11 లక్షల వ్యయంతో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత వడ్లమూడి భూపాల్ ను అభినందిస్తూ., సీఎం చంద్రబాబు పిలుపు మేరకు పి4 లోభాగంగా ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు అవకాశం ఉన్న మరింత మంది ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ల ఏర్పాటుతో ప్రైవేటుకు ధీటుగా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారశెట్టి పాపారావు, యువ నాయకులు డా. కడియాల లలిత్ సాగర్ పలువురు పాల్గొన్నారు.

## డ్రంక్ డ్రైవ్ కేసుల్లో 1.30 లక్షల జరిమానా

### ఏడుగురికి జైలు శిక్ష



తాళ్లరేవు, మహి న్యూస్, ఏప్రిల్ 13.: కాకినాడ రూరల్ సర్కిల్ కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీలలో నమోదు చేసిన 20 డ్రంక్ డ్రైవ్ కేసులలో 13 మందికి 1.30 లక్షల జరిమానా, ఏడుగురికి రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధించడం జరిగిందని కోరంగి ఎస్ఐ పి.సత్యన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 మందిని కోర్టులో హాజరు పరచగా కాకినాడ ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే ఏడుగురికి 2 రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరక్కుండా ముందస్తు చర్యల్లో బాగంగా విస్తృతంగా కోరంగి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని, కటకటాలపాలౌతారని ఎస్ఐ సత్యన్నారాయణ హెచ్చరించారు.

## 20 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.12,87,525 విలువైన సి. ఏం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



మైదుకూరు. మహిన్యూస్. ఏప్రిల్:13: మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 20 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.12,87,525 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి సిఎంరాఫ్. చెక్కు ల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద మరియు ఆర్థికంగా బలహీన వర్గాలకు వైద్య చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం పెద్ద ఊరటగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తోందని, అత్యవసర పరిస్థితుల్లో ఎప్పటికప్పుడు అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే గారికి మరియు ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## గుమ్మిరెడ్డి లక్ష్మీదేవి నేత్రదానం ఇద్దరు అంధులకు చూపు



పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 13: పులివెందుల పట్టణం బైపాస్ రోడ్ లోని గుమ్మిరెడ్డి లక్ష్మీదేవి(77 సంవత్సరాలు) సోమవారం మరణిం చడంతో ఆమె కుమారుడు విష్ణు వర్ధన్ రెడ్డి, కుమార్తె లు అపర్ణ, కవిత, నాగలక్ష్మి,కోడలు మమత, అల్లుడు గోపాల్, మనవడు విశ్వతేజ, మనవరాలు కౌశిక లు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ , స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు లకు సమాచారం అందజేశారు. దీంతో టెక్నీషియన్ ప్రశాంత్ కుమార్ తో కలిసి మృతురాలి నివాసం వద్ద పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి కడప ఎల్ వి ప్రసాద్ నేత్రాలయానికి పంపడం జరిగింది.ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఎంతోమంది కార్నియా సమస్య కారణంగా చూపు కోల్పోయి ఈ ప్రపంచాన్ని చూడలేక అంధత్వం తో బాధపడుతూ కార్నియా ల కోసం ఎదురుచూస్తూ ఉన్నారని ఆయన అన్నారు. అలాంటి వారికోసం నేత్రదానం చేసేందుకు ప్రతి కుటుంబం ముందుకు రావాలని, కుటుంబం లోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన వెంటనే 9966509364 కి సమాచారం ఇచ్చినట్లు అయితే ఇంటి వద్దకే వచ్చి పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి అంధత్వం తో బాధ పడుతున్న వారికి అమర్చి చూపు ఇచ్చి మరణించిన తరువాత కూడా మళ్ళీ ఈ ప్రపంచాన్ని చూసే బృహత్కార్యం నేత్రదానం మాత్రమే అని కావున ప్రతి కుటుంబం నేత్రదానం పై అవగాహన కలిగి నేత్రదానం చేసి అందరహిత సమాజం కోసం ప్రతిఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

## బీడు భూమి రైతుల పాలిట ఆశాజ్యోతి.. "హాఫ్ మూన్ నమూనా"







కడప జిల్లా, మహి న్యూస్ ఏప్రిల్ 13 : పోరుమామిళ్ల డివిజన్ ౹ాూఖచీ మండలం వరికుంట్ల పంచాయతీ నాయనపల్లి గ్రామంలో కాశీనారాయణ అనే రైతు పొలంలో హాఫ్ మూన్ మోడల్ పైన జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరిగినది. అనంతపురంలో చీఫ్ టెక్నికల్ ఇన్నోవేషన్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన కేడర్లు, కడప జిల్లాలోని ప్రతి డివిజన్‌లో హాఫ్ మూన్ మోడల్‌ను అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోంది. అర్ధ చంద్రాకారంలో ఉండే ఈ హాఫ్ మూన్ మోడల్‌ను ముఖ్యంగా వర్షాధార భూములు, వాలుగా ఉన్న భూములు మరియు బీడు భూములలో అమలు చేయవచ్చని తెలిపారు. వాలుగా ఉన్న భూములలో వర్షపు నీరు బయటకు వెళ్లిపోవడం వల్ల సారవంతమైన మట్టి నష్టం జరుగుతుంది. ఈ హాఫ్ మూన్ మోడల్ ద్వారా వర్షపు నీటిని పొలంలోనే నిల్వ చేయడంతో పాటు సారవంతమైన మట్టిని కూడా సంరక్షించవచ్చని వివరించారు. ఈ విధానం ద్వారా భూమిలో తేమ నిలిచి పంటలు సాగు చేయడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని, అలాగే భూమిలో ఉష్ణోగ్రత తగ్గింపుకు కూడా ఇది సహాయపడుతుందని తెలిపారు. దీని ద్వారా ఇప్పటివరకు బీడు భూములుగా ఉన్న భూములను తిరిగి సాగులోకి తీసుకురావడం సాధ్యమవుతుందని చెప్పారు. అలాగే ఈ హాఫ్ మూన్ మోడల్‌లో పత్తి, కంది, ఆముదం, సజ్జ, అనప వంటి పంటలను విత్తన గుళికలు తయారు చేసుకుని విత్తడం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ కాలం పాటు పంటలను సాగు చేసి మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. అలాగే డివిజన్ చీఫీూ నరసింహారెడ్డి సార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ముఖ్య ఉదేశం గురించి మండలంలో అమలు చేస్తున్న మోడల్స్ గురించి అలాగే మంచి ఆరోగ్యం మంచి నేల గురించి తెలియజేసి ప్రకృతి వ్యవసాయంను ప్రోత్సహిస్తూ మాట్లాడటం జరిగినది.

## జి.కొండూరులో ఘనంగా శ్రీ కార్యసిద్ధి దాస ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ట వేడుకలలో పాల్గొన్న కోగంటి సత్యనారాయణ..

జి. కొండూరు. ఏప్రిల్ 13. .: ఎన్టీఆర్ జిల్లా . మైలవరం నియోజకవర్గం. జి. కొండూరు మండల కేంద్రంలోని జి.కొండూరులో గ్రామంలో వెలసిన శ్రీ దాస కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ, వంగవీటి రంగా కుమార్తె వంగవీటి ఆశాకిరణ్ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అన్నసమారాధన కోసం కోగంటి సత్యనారాయణ రూ.30 వేల విలువైన బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కోగంటి సత్యనారాయణకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు..

# కేటగిరీ మార్పు కోసం

### మంత్రి ఆనంకు వినతి బిజెపి నాయకులు

అమలాపురం ఏప్రిల్ 13 : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా కాట్రేనికోన మండలం కుండలేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి కార్యక్రమము నిమిత్తము స్థానిక శాసనసభ్యులు దాట్ల బుచ్చిరాజు దేవాదాయ ధర్మాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి పార్లమెంటరీ సభ్యులు హరీష్ మాధుర్ ఎమ్మెల్సీ రాజశేఖర్ కూటమి నాయకులు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ మంత్రివర్యులు కలిసి రాష్ట్రంలో ఉన్న చిన్న దేవాలయములకు విద్యుత్ బిల్లులు చెల్లించుట చాలా కష్టంగా ఉన్నది కావున 7 స్లాబ్ నుంచి తొలగించి 1వ స్లాబ్ కు మార్చవలసినదిగా మంత్రిగారిని కోరడమైనది ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొల కోటి వెంకటరెడ్డి జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మట్టా సూరిబాబు మండల ప్రధాన కార్యదర్శి సురేష్ గాలి దేవర శివాజీ తదితరులు కలిసి వినతి పత్రం ఇవ్వడం అయినది

## కుండలేశ్వరంలో పుష్కర పనులకు శంకుస్థాపన

### ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి

### యాత్రికులకు వసతి భవనం ఏర్పాటు

అమలాపురం ఏప్రిల్ 13: రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా లక్షలాది భక్తులకు మెరుగైన వసతి, దర్శన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయాల అభివృద్ధి చేపడుతున్నట్లు ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండల పరిధిలో దక్షిణ కాశీగా పేరుపొందిన కుండలేశ్వరం పుణ్యక్షేత్రంలో నిర్మించనున్న వసతి భవనం భక్తులకు విశేష ప్రయోజనం కలిగిస్తుందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. అలాగే కోనసీమ జిల్లాలోని పలు ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు, కుండలేశ్వరంలో అన్నదాన భవన నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దేవాలయాల పరిరక్షణ మరియు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు, ఆలయాల పునరుద్ధరణ, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆధ్యాత్మిక వాతావరణం అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ముందుగా కుండలేశ్వర స్వామిని దర్శించికుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ కొర్లపాటి సత్య వెంకట దుర్గా ప్రధాన అర్చకులు నాగ మల్లేశ్వర రావు, కామేశ్వర రావు ఆధ్వర్యంలో మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఆర్ జేసీ త్రినాధ రావు, ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఓగూరి బాగ్యశ్రీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయి, మురమళ్ళ వీరేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు త్సవటపల్లి నాగేంద్ర రావు(నాగు), ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, నాయకులు నడింపల్లి సుబ్బరాజు, త్సవటపల్లి శ్రీనివాస్, గిడ్డి రత్నశ్రీ, విత్తనాల బుజ్జి, గోకరకొండ సత్యనారాయణ, పిఎస్విన్ రాజు, చెల్లి సురేష్, రంభాల రమేష్, మోకా బాల ప్రసాద్, ఏఎంసి వైస్ చైర్మన్ గొల్ల కోటి వెంకటరెడ్డి, డైరెక్టర్ మట్ట సూరిబాబు, బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంథి నానాజీ, కాండ్రేకుల సత్య ప్రసాద్, వంగా దుర్గా బాబు, గంగుమల్ల వీరభద్ర రావు, ఎంపిడిఓ బి. రాజేశ్వరరావు, తహసిల్దార్ రవి కిరణ్, కుండలేశ్వరం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, సూర్యనారాయణ రాజు, కాట్రేనికోన మండల ప్రజా పరిషత్ పరిపాలన అధికారిణి సంఘమిత్ర, వివిధ గ్రామాల కూటమి నాయకులు, ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా కార్యసిద్ధి దాసాంజనేయ స్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠ

### స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు.

జి.కొండూరు, ఏప్రిల్ 13..: ఎన్టీఆర్ జిల్లా .మండల కేంద్రమైన జి.కొండూరులో కొలువుదీరిన కార్యసిద్ధి శ్రీ దాసాంజనేయ స్వామి వారి ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవం సోమవారం కన్నులపండువగా జరిగింది. ఈ మహోత్సవ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. సోమవారం ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద నవధాన్యాలు సమర్పించారు. ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆంజనేయస్వామి వారి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు..

## వైస్సార్సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడికి చిరు సత్కారం

### ఎన్టీఆర్ జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షుడిగా షేక్ ఉస్మాన్ కు శుభాకాంక్షలు తెలియజేసిన బాజీ బాబా

విజయవాడ పశ్చిమ (ఏప్రిల్ 13): ఈరోజు వైయస్సార్.కాంగ్రెస్ పార్టీకేంద్రమైనారిటీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన ఎన్టీఆర్ జిల్లామైనారిటీ ఉపాధ్యక్షుడుగౌరవప్రదంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీరాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు వి ఖాదర్.బాషా రాష్ట్ర కార్యదర్శి మైనారిటీ బాజీ బాబా నిమర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి కి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష కి కృతజ్ఞతలు తెలియజేశారు రాబోవు కాలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు పూర్తిగా సహకరించి జగన్మోహన్ రెడ్డి ని మరలా ముఖ్యమంత్రి చేసేంతవరకు సాయి శక్తుల ప్రయత్నిస్తా నని ఉస్మాన్ తెలియజేసినారు ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమామ్ హుస్సేన్. తూర్పు నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు షేక్ సుభాని మైనారిటీ నాయకులు సికందర్ అహ్మద్ షరీఫ్ జాఫర్ మోయిన్ రహీం ఖాదర్ తదితరులు పాల్గొన్నారు

# నీరే సహజ సంపద..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### జల సంరక్షణలో భాగంగా బద్వేలు మండలం చింతల చెరువుకు సాగునీరు

కడప, మహి న్యూస్ ఏప్రిల్ 13 : ప్రాణ కోటికి జీవనాధారం అయిన జల సంపదనకు సంరక్షించుకోవాల్సిన బాధ్యత మన



అందరిపై ఉందని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రైతులకు





సూచించారు. సోమవారం సాయంత్రం బద్వేలు నియోజకవర్గపరిధిలోని చింతల చెరువు వద్ద ఏర్పాటు చేసిన "జలధార– నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ" కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జలమే సంపద... దాన్ని ఎంత పొదుపుగా వినియోగించుకుంటే అంత సంపదను సృష్టించవచ్చన్నారు. నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామన్నారు. 'రాష్ట్ర వ్యాప్తంగా నీటి భద్రత కోసమే పనిచేస్తున్నాన్నారు. రాష్ట్ర ప్రభుత్వం "నీటి భద్రత–సాగు నీటి సంఘాల బాధ్యత" అనే పేరుతో ఏప్రిల్ 6 నుండి జులై 14, 2026 వరకు (100 రోజులపాటు) రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. చెరువుల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమం 4 దశలలో జరుగుతుంది. జిల్లా స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలని.. నీటి వినియోగదారుల సంఘాలు, గ్రామపంచాయతీలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం ఉండాలన్నారు. జలాధార కార్యక్రమంలో భాగంగా.. జిల్లాలో మొట్టమొదటి కార్యక్రమంగా చెన్నంపల్లె చెరువు నుండి బయనపల్లెకు రెండు మీటర్ల మేర స్లూఈజ్ కాలువనా కాలువ ద్వారా నీటిని అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు. బయనపల్లె చెరువు నుండి.. ఈ ప్రక్రియ ద్వారా చెన్నంపల్లి చెరువు నుండి బయనపల్లి చెరువుకు ఒక పది రోజుల్లో నీటిని చేరవేసే దిశగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. రాయలసీమ ప్రాంతాల్లో సారవంతమైన ఉన్నాయని.. ఉద్యాన పంటల దిగుబడులతో మార్కెట్లో కనీసం రెండు లక్షల నుంచి 5 నుంచి 6 లక్షల రూపాయల ఆదాయం వస్తుందన్నారు. రైతులకుంటాయంతో పాటు రైతుకు స్థిరత్వాన్ని అందించేవి ఉద్యాన పంటలే అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ విధానం ద్వారా ఉద్యాన పంటల సాగుతో అత్యంత లాభదాయకంగా రైతులు దిగుబడులు సాధించవచ్చు అన్నారు. ఒకవైపు నీటిని పొదుపుగా వాడుకుంటూనే, మరో వైపు భూగర్భ జలాలను భవిష్య తరాలకు భద్రంగా రైతు ఆలోచనలో మార్పు వస్తేనే లాభాల బాటలో నడవగలడన్నారు. రైతులకు వెన్నుదన్నుగా ఉంటూ.. ఆదాయంలో స్థిరత్వాన్ని అందించేవి ఉద్యాన పంటలే అని ఉద్యన పంటల సాగువైపు మక్కువ చూపాలని జిల్లా కలెక్టర్ రైతులకు సలహాలు ఇచ్చారు. సీజన్లకు అనుగుణంగా, కాలానికి అనుగుణంగా పంటలను మార్పు చేసుకోవాలన్నారు. చెరువులు గ్రామాల సహజ సంపద అని.. చెరువులలో నీరు గ్రామంలో ప్రతి ఒక్కరి స్థిరఆస్తి అన్నారు. ప్రతి గ్రామంలోను రైతులు, వారి జలఆధారం, వారి పంటల సాగు, నీటి వినియోగంపై దృష్టి సారించాలన్నారు. రానున్న ఖరీఫ్ సీజనుకు పంటల సాగుకు సన్నద్ధం అవ్వడంలో భాగంగా.. 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో ఇంకా 80 రోజుల సమయం ఉందని, ఈ లోపు అన్నిరకాల సదుపాయాలను కల్పించుకునేందుకు.. సంబంధిత అధికారులు, సిబ్బంది రైతులకు సహాయ సహకారాలు అందించడం జరుగుతోందన్నారు. ఉద్యాన పంటలకు అత్యంత అనుకూలమైన నేలలు రాయలసీమ ప్రాంతంలో ఉన్నాయన్నారు. బంగారం లాంటి ఈ నెలల్లో బంగారం లాంటి పంటలు పండించే అవకాశాలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో జలాధార కార్యక్రమం ద్వారా మన పరిసరల్లోని మన చెరువులకు జలకళను సంతరించుకునే అవకాశాలను మనమే



సమకూర్చుకోవలన్నారు. కాబట్టి వ్యవసాయ సాగులో ప్రధాన పంటగా అధిక నీటిని ఖర్చు చేసే వరికి బదులు.. అతితక్కువ నీటి ఖర్చుతో ఉద్యాన పంటల సాగును విస్తరింపజేయాలని కోరారు. సూక్ష్మ నీటి సాగు విధానాలను అవలంభిస్తూ బంగారు దిగుబడులను అందించే.. ఉద్యాన పంటలు పండించేందుకు రైతులు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ రైతులకు సలహాలిచ్చారు. ఈ 80 రోజుల్లో స్థానిక చెరువులు, స్లుయిజ్ కాలువలు, పిల్ల కాలువలు, పంట కాలువలను పటిష్టం చేసుకుని చెరువులను జలాధార కార్యాక్రయం ద్వారా జల పుష్టికరం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, డ్వామా, డీఆర్డీఏ పిడీలు అదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు రితేష్ రెడ్డి, సాగునీటి సంఘాల సభ్యులు, ఇరిగేషన్ అధికారులు, మరియు పెద్ద సంఖ్యలో రైతులు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నిమ్మల రామానాయుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు

### వైయస్ జగన్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదు

### హత్యా రాజకీయాలను ప్రోత్సహించే సంస్కృతి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి లేదు

### వైకాపా నాయకులు




పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 13: నిమ్మల రామానాయుడు నోరు అదుపులో పెట్టుకొ ని మాట్లాడు అని, వైయస్ జగన్మోహన్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత నీకు లేదని, హత్య రాజకీయాలను ప్రోత్సహించే సంస్కృతి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి లేదని వైకాపా బలిజ సంఘం నాయకులు సోపాల వీర, కొంగనపల్లి మురళి, బ్యాటరీ ప్రసాద్, కొంగనపల్లి విజయ్ కుమార్, తోటం శెట్టి హరి, బత్తిన శేఖర్ లు అన్నారు. సోమవారం జగన్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హత్య రాజకీయాలకు, వెన్నుపోటు రాజకీయాలకు పేటెంట్ హక్కులు కలిగిన పార్టీ , కుటుంబం నారా కుటుంబమే అన్నారు.రాజకీయంగా ఎదుర్కోలేక లేని పోనీ ఆరోపణలు చేస్తూ వ్యక్తిత్వ హనానికి పాల్పడుతున్నారు అన్నారు.పరిటాల హత్యాకేసు కేసులో జగన్ ప్రమేయం ఉందని తేలితే ఉరి తీయండి అని వైయస్సార్ అసెంబ్లీ సాక్షి గా చెప్పి కేసు సిబిఐ కి అప్పగించారు అన్నారు. వైయస్ కుటుంబం లో చిచ్చు పెట్టి జగన్ మోహన్ రెడ్డి పై బురద చల్లే ప్రయత్నం లో భాగమే వివేకా హత్య కేసు లో అవినాష్ రెడ్డి ని ఇరికించి అక్రమ కేసులు బనాయించడం జరిగింది అన్నారు.మీ పార్టీ అధికారం లో ఉన్నా వైఎస్ అవినాష్ రెడ్డి తప్పు లేదనే సుప్రీమ్ కోర్టు తెలిపింది అన్నారు.ఎన్ని కుయుక్తులు పన్నిన చివరకు న్యాయమే గెలుస్తుం ది జగన్ మోహన్ రెడ్డి కడిన ముత్యంలా బయటకు వచ్చారు అన్నారు. పులివెందుల అంటే ఒకప్పుడు కరుడుగట్టిన ఫ్యాక్షన్ ప్రాంతం గా ఉండేది కానీ వైయస్సార్ కుటుంబం వలనే పులివెందుల తో పాటు కడప జిల్లా లో ఫ్యాక్షన్ పూర్తిగా అంతమొందించడం జరిగింది అని తెలిపారు.వంగవీటి ని హత్య చేయించింది ఎవ్వరో ఈ రాష్ట్రం అంతా తెలుసు, ఆ మచ్చ పోవడానికి బలిజ కులం ఓట్లు పొందడానికే పవన్ కళ్యాణ్ తో జట్టు కట్టారు అన్నారు.నిమ్మల రామానాయుడు ఎన్నికల ముందు నీకు 15 వేలు నీకు 15 వేలు అని చెప్పి ప్రజలను మోసం చేశావు ఇప్పుడు బయటకు వస్తే ప్రజలు చీపురు తో కొట్టే పరిస్థితి నెలకొంది అన్నారు.ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి, ఇంకోసారి వైఎస్ జగన్ గురించి మాట్లాడి, బలిజ కులాన్ని నీ నీచ రాజకీయాలకు ముడిపెడితే నీ ఇంటిని ముట్టడించి నిరసన వ్యక్తం చేస్తాం అని తెలిపారు.

# పోషణ పక్షోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా

నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 13 :- పోషణ పక్షోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల్లో ఆరోగ్యం, పోషణపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పోషణ పక్షోత్సవాలకు సంబంధించిన గోడప్రచార పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి దేవి, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 9 నుండి 23 వరకు పోషణ పక్షోత్సవాలను "క్యాంపెయిన్ మోడ్"లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ, డీఆర్‌డీఏ, మెప్మా, పాఠశాల విద్యాశాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖలు భాగస్వాములుగా పనిచేస్తున్నాయని చెప్పారు. సమాజంలో మారుతున్న తరాలైన జనరేషన్ జెడ్ , జనరేషన్ ఆల్ఫా , జనరేషన్ బీటా పిల్లల ఆరోగ్యం, పోషణ అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

#### జంక్ ఫుడ్ ప్రభావం

ప్రస్తుతం పిల్లలు బింగో, లేస్, కుర్కురే వంటి ప్యాకేజ్డ్ జంక్ ఫుడ్స్‌కు అలవాటు పడుతున్నారని, వీటిలో సోడియం నైట్రేట్, సోడియం బెంజోయేట్ వంటి హానికర రసాయనాలు అధికంగా ఉండటం వల్ల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతోందని హెచ్చరించారు. వీటి వినియోగం వల్ల చిన్న వయసులోనే రక్తపోటు,




మధుమేహం, క్యాన్సర్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, రోగనిరోధక శక్తి తగ్గిపోతుందని తెలిపారు.

#### స్క్రీన్ టైమ్ ప్రభావం

పిల్లల మెదడు అభివృద్ధిలో గర్భధారణ నుండి రెండు సంవత్సరాల వరకు ఉండే మొదటి 1000 రోజులు అత్యంత కీలకమని, ఈ సమయంలోనే 80 శాతం మెదడు అభివృద్ధి జరుగుతుందని, మిగిలిన అభివృద్ధి ఐదేళ్ల వయస్సు వరకు కొనసాగుతుందని వివరించారు. ఈ దశలో గర్భిణీలు, పాలిచ్చే తల్లులు మరియు చిన్నపిల్లలు అధికంగా మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వల్ల పిల్లల్లో మాటల ఆలస్యం, భావోద్వేగ సమస్యలు, ప్రవర్తనా మార్పులు, ఆటిజం లక్షణాలు కనిపించే అవకాశముందని తెలిపారు. కాబట్టి గర్భిణీలు, పాలిచ్చే తల్లులు మొబైల్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అధిక స్క్రీన్ టైమ్ వల్ల కంటి సమస్యలు కూడా పెరుగుతున్నాయని అన్నారు.

#### కథల ప్రాముఖ్యత

పిల్లల సమగ్ర అభివృద్ధిలో కథల పాత్ర ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దలు కథలు చెప్పడం ద్వారా పిల్లల్లో నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, భాషా పటిమ మరియు సృజనాత్మకత పెరుగుతాయని చెప్పారు. అంతకుముందు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి దేవి మాట్లాడుతూ, పిల్లలను ఆరోగ్యంగా పెంచేందుకు జంక్ ఫుడ్‌కు బదులుగా ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. అలాగే మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచి, కథలు చెప్పే పాత సంప్రదాయాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్ల ద్వారా ఈ అవగాహనను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# జిల్లా కలెక్టర్ నిధులతో ఒక్కొక్క పీ హెచ్ సి కి 25 వేల రూపాయలతో ఇంటర్నెట్ కనెక్షన్

చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 13 : జిల్లా కలెక్టర్ నిధులతో ఒక్కొక్క పీ హెచ్ సి కి 25 వేల రూపాయలతో ఇంటర్నెట్ కనెక్షన్ కేటాయించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో చిత్తూరు మరియు పూతలపట్టు నియోజకవర్గ పిహెచ్ సి స్టాఫ్ నర్స్ లకు సంజీవని ప్రాజెక్టు పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పీహెచ్ సి కి వారం లోపల ఇంటర్నెట్ అలాట్ చేయడం జరుగుతుందని, తద్వారా అభా ఐ డి క్రియేషన్ సులభం అవుతుందన్నారు. అన్ని రకాల రిపోర్ట్స్ మరియు పేషంట్స్ రిజిస్ట్రేషన్ అప్ డేట్ చేయాలన్నారు. ఓపికి వచ్చిన ప్రతి పేషెంట్ ను తప్పనిసరిగా రిజిష్టర్ నందు నమోదు చేయాలని సాయంత్రం నాలుగు తర్వాత వచ్చే పేషెంట్లు కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. పిహెచ్ సి నందు నాలుగు లాగిన్స్ పిసిసి, స్టాఫ్ నర్స్, డాక్టర్, ఎల్ టి, ఫార్మసిస్ట్ తప్పనిసరిగా అందరూ ఓపి పేషెంట్స్ కు 100% చేయాలని ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ కొరకు మీ వంతు సహకారం అందించాలని ఆదేశించారు. తద్వారా సులభంగా వెనకటికి పేషెంట్స్ కు చికిత్స ఇవ్వడం జరుగుతుందన్నారు. హెల్త్ సిస్టంలో అందరూ కలిసి పనిచేస్తే ఖచ్చితమైన డిజిటల్ డేటా ఎంట్రీ విత్ అభా ఐడి తో భవిష్యత్ పునః పరిశీలనకు(సులభ చికిత్సకు) తోడ్పడుతుందని తెలిపారు. ప్రజలకు దీర్ఘకాలిక వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ వంతు కృషితో అందరికీ మంచి ఆరోగ్యం దిశగా పయనిద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఏ నాగ శశిభూషణ్ రెడ్డి, డిఎస్ఓ డాక్టర్ గిరి, చిత్తూరు మరియు పూతలపట్టు కన్సల్టెన్సీ పిహెచ్ సి స్టాఫ్ నర్సులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు పూర్తి ఉచిత విద్యుత్తు యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

వెదురు కుప్పం, మహి న్యూస్, ఏప్రిల్ 13: ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు పూర్తి ఉచిత విద్యుత్తు యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ సుమంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని గంగాధర నెల్లూరులోని ఎస్సీ కాలనీ నందు పియం సూర్యగర్ పథకం కింద ఎస్సీ,ఎస్టీ గృహాలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే థామస్ గారితో కలిసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. అక్కడ జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పియం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా రాష్ట్రంలో ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేసుకుని వినియోగించుకునేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని అన్నారు. పియం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ అమర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఈ పథకం ద్వారా ఉచిత కరెంటు అందించుటకు శ్రీకారం చుట్టామని, దీనికి సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన మరియు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సోలార్ ప్లాంట్లు ధరఖాస్తులు బ్యాంకులో పెండింగు లేకుండా రుణాలను మంజూరు చేయాలని అప్పుడే ఈ పథకానికి మంచి ప్రగతి కనపడుతుంది అన్నారు. పీఎం కుసుమ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించి ఈ పథకాన్ని ప్రతి రైతుకు అందించాలని అన్నారు. ప్రభుత్వ విప్ మరియు స్థానిక ఎమ్మెల్యే ఎ.వీ థామస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 5000 మంది లబ్ధిదారులు ఉన్నారని, సుమారు 60 కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపి ఉన్నదని తెలిపారు ఒక్క జీడి నెల్లూరు మండలానికి మాత్రం రూ. 3 కోట్ల రూపాయలు వేయడంతో 1.5 వందల మంది లబ్ధిదారులకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక్క యూనిట్ ధర రూ. 1.2 లక్షల విలువైన ప్యానెల్ లను ఎస్సీ, ఎస్టీల వినియోగదారులకు ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో ప్రతి కుటుంబానికి నెలకు రూ. 500 నుండి రూ. 600 వందల రూపాయల వరకు ఆదా అవుతుందన్నారు. ఇది ఒక మంచి కార్యక్రమం కాబట్టి సంబంధిత అధికారులు మీ వద్దకు వచ్చేటప్పుడు ఎంత త్వరగా స్పందించి సహకరిస్తారో.. అంత త్వరగా ప్యానల్స్ ఏర్పాటును పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఎస్పీడీసీఎల్ ఎస్ఈ.అమరబాబుమాట్లాడుతూ..లి జీడి నెల్లూరు నియోజకవర్గానికి మంజూరైన 5 వేల ప్యానల్ లను 6 మండలాలల్లో 2 బ్యాచ్ లుగా అధికారులను వినియోగదారుల వద్దకు పంపి ఈ సోలార్ ప్యానెల్స్ ను ఉచితంగా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ సోలార్ ప్యానల్ ఏర్పాటుకు నియోజకవర్గ వినియోగదారులు తప్పక సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఐజుజు, ూజు లు, విద్యుత్ శాఖ అధికారులను ఎస్ఇ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు రూరల్ ఇ.ఈ సురేష్ కుమార్, జీడి నెల్లూరు ఆపరేషన్ డీ.ఇ.ఈ శేషాద్రి రెడ్డి, ఏఈ వరదరాజులు, ఆవల్ కొండ ఏఈ విగ్నేష్, పాలసముద్రం ఏఈ లోకేష్ రెడ్డి, పెనుమూరు ఏఈ తులసి, సీనియర్ అసిస్టెంట్ యగ్నేష్ మరియు జీడీ నెల్లూరు ఏపీఎస్పీడీసీఎల్ సిబ్బందితో పాటు కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ మరియు స్థానిక ఎమ్మెల్యే వి. ఎం థామస్

వెదురు కుప్పం, మహి న్యూస్, ఏప్రిల్ 13: సమస్యల పరిష్కారంలో అల స్వత్వం వద్దు అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం వెదురు కుప్పం, ఎంపీడీఓ కార్యాలయం నందు నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమం అమల లో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ వి.ఎమ్ థామస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు అధిక మొత్తంలో ఉన్నాయని వాటిని పరిష్కరించవలసిందిగా తెలిపారు. ఈ మండలంలో అధిక శాతం రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారనిమేము ఆదాయం చెల్లించాం, కానీ ట్రాన్స్‌ఫార్మర్ అందలేదు" అని ఎలాంటి సమస్యలు అందిస్తున్నారని తెలుస్తోంది. ఈ పెద్ద సంఖ్యలో అభ్యర్థనలు రావడం అసాధారణం. వెంటనే సీఎం తో సంప్రదించి, 40 ట్రాన్స్‌ఫార్మర్ల ప్రత్యేక మంజూరు పొందాము. కలెక్టర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలపదలచుకున్నాం. ప్రస్తుత ప్రభుత్వం సమగ్ర, వ్యవస్థాగతంగా ప్రజల ప్రయోజనాల కోసం చట్టబద్ధంగా చర్యలు చేపడుతుంది. తహసీల్దార్ మరియు వర్గాధికారులు కాస్త వేగంగా, బాధ్యతాయుతంగా పని చేయటం ద్వారా మరిన్ని సమస్యలను త్వరగా పరిష్కరించవచ్చు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మూడు నెలలుగా అర్జీల తాకిడి తగ్గి మొఖం పట్టిందన్నారు మండలాలలో ఎవరెవరు దగ్గర ఫైల్ పెండింగ్లో ఉన్నాయనేది ఎమ్మార్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించుకుని వాటి నివేదికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వీఆర్ఓ కార్యదర్శులు తమ గ్రామ స్థాయిలో పారదర్శకంగా, పక్షపాతం లేకుండా సమస్యలను పరిష్కరించాలని, గతంలో జరిగిన లోపాలు ఉండకూడదని సూచించారు. చిన్న సమస్యలను స్థాయిలోనే పరిష్కరించగలిగితే పెద్ద సమస్యలు రాక ముందే నియంత్రించవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరిష్కరించగలిగిన అర్జీలను ఖచ్చితంగా పరిష్కరించాలి


### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 13 : సోమవారం స్థానిక వెదురుకుప్పం మండలం లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ లకు ఎక్కువ శాతం రెవెన్యూ సంబంధిత శాతం అర్జీలు వస్తున్నాయని, అందులో మండల స్థాయిలో పరిష్కరించగలిగిన అర్జీలను ఖచ్చితంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం వెదురుకుప్పం మండలం లో ఎంపిడిఓ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్థానిక జిడి నెల్లూరు శాసన సభ్యులు ప్రభుత్వ విప్ వియమ్ థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వినతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ రాజేంద్రన్, డి ఆర్ ఓ మోహన్ కుమార్, చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం నాణ్యతగా ఉండాలని అయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. గడువు ముగిసేలోగా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు

**ఈరోజు నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమం నందు ప్రజల నుంచి వివిధ సమస్యల పై 158 వినతలు స్వీకరించారు.**

రెవెన్యూ 35 , సర్వే సెటిల్మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ 77, పంచాయత్ రాజ్ ఇంజనీరింగ 9, విద్యుత్ శాఖ 7, ఏపీ ఎస్ ఆర్ టీ సి 3, అనిమల్ హస్బంద్రీ 3, పంచాయత్ రాజ్ 3, గృహ నిర్మాణ శాఖ 3, వాటర్ రిసోర్స్ 2, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ 2, పోలీస్ 2, విభిన్న ప్రతిభ వంతులు 1, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ 1, ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ 1, ఫారెస్ట్ 1, షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోపరేటివ్ కార్పొరేషన్ 1, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 1, పెన్షన్ 6, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, ఆర్డీ ఓ, కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల ఉత్సవం ప్రారంభం



తిరుపతి, మహి న్యూస్, ఏప్రిల్ 13: తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల (శ్రీ రామానుజాచార్యులు) ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 21న భోగి తేరు, ఏప్రిల్ 22న సాత్తుమొర, ఏప్రిల్ 23న గంధపొడి ఉత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం భాష్యకార్ల వారికి బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో, సాయంత్రం పెద్ద వీధి ఉత్సవం వైభవంగా చేపడుతారు. అదేవిధంగా ప్రతిరోజు దివ్యప్రబంధ సేవాకాలం, సాత్తుమొర, ఆస్థానం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు శ్రీనివాస దీక్షితులు, ఆలయ డెప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.



# భారీ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన తిరుచానూరు టూరిస్ట్ బస్టాండ్ వేలంపాట





తిరుచానూరు,మహి న్యూస్, ఏప్రిల్ 13: తిరుచానూరు గ్రామ పంచాయతీ ఆదాయ వనరులలో అత్యంత కీలకమైన పాత టూరిస్ట్ బస్టాండ్ సుంకం వసూలు హక్కుల వేలంపాట సోమవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉత్కంఠభరితంగా సాగింది. పోలీసుల భారీ బందోబస్తు నడుమ అత్యంత పారదర్శకంగా నిర్వహించిన ఈ ప్రక్రియలో గుత్తేదారులు పోటాపోటీగా పాల్గొనడంతో పంచాయతీకి రికార్డు స్థాయి ఆదాయం సమకూరింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ వేలం నిర్వహించారు.

### పోటాపోటీగా సాగిన బహిరంగ వేలం

డి.ఎల్.పి.ఓ సురేష్ నాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ వేలం పాటలో పలువురు గుత్తేదారులు పాల్గొన్నారు. పంచాయతీ నిబంధనల మేరకు బహిరంగ వేలంతో పాటు సీల్డ్ టెండర్లను కూడా అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. ముందుగా నిర్వహించిన బహిరంగ వేలం పాటలో డి. కిరణ్ రెడ్డి అత్యధికంగా రూ. 3,15,40,000 పాడుకొని ముందంజలో నిలిచారు.

### అనంతరం సీల్డ్ టెండర్లను పరిశీలించగా..

అందులో డి. సాయి రూ. 3,15,09,000 కోట్ చేయగా, డి. కిరణ్ రెడ్డి రూ. 3,15,00,099 కోట్ చేశారు. బహిరంగ వేలం పాట ద్వారానే పంచాయతీకి అధిక లాభం చేకూరుతుండటంతో, అధికారులు బహిరంగ వేలం పాటనే ప్రామాణికంగా తీసుకుని టెండర్ను డి. కిరణ్ రెడ్డికి ఖరారు చేశారు.

### జీఎస్టీతో కలిపి మొత్తం ఆదాయం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం పాట ధరకు 18 శాతం జీఎస్టీ అదనం. దీనితో కలిపి మొత్తం రూ. 3,72,15,200 (మూడు కోట్ల డెబ్బై రెండు లక్షల పదిహేను వేల రెండు వందలు) ఆదాయం పంచాయతీకి లభించనుంది. అత్యధిక ధర పలికిన డి. కిరణ్ రెడ్డికి ఈ టెండర్ దక్కినట్లు డి.ఎల్.పి.ఓ సురేష్ నాయుడు అధికారికంగా ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, కార్యాలయ సిబ్బంది మరియు గుత్తేదారుల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 136 జయంతి ఉత్సవాలు జిల్లాలో ఘనంగా నిర్వహణ

చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 13: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 136 జయంతి ఉత్సవాలు జిల్లాలో ఘనంగా నిర్వహించుచున్నామని ప్రజలు, పుర ప్రముఖులు, పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలనిజిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిఎస్ కె రబ్బానీ భాష, సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాబ్?డా॥ బి.ఆర్.అంబేద్కర్ గారి 136వ జన్మదిన వేడుకల సందర్భంగా, 14.04.2026 తేదీ ఉదయం 09-00 గంటలకు, డా॥ బి.ఆర్.అంబేద్కర్ గారి విగ్రహమునకు, దర్గా సర్కిల్, చిత్తూరు వద్ద పూలమాల అలంకరణ తదనంతరం డా॥ బి.ఆర్.అంబేద్కర్ భవనము వరకు, చిత్ర పటము ఊరేగింపు మరియు 10-00 గంటలకు డా॥ బి.ఆర్.అంబేద్కర్ భవనము, మేసానికల్ గ్రౌండ్ ప్రక్కన, చిత్తూరు నందు సభా కార్యక్రమము నిర్వహించబడును. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చిత్తూరు జిల్లాలో గల ప్రజా ప్రతినిధులు, జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఎస్సీ,ఎస్టీ,బీసీ మరియు మైనారిటీ సంఘనాయకులు, కార్మికులు, కర్షకులు, అధికారులు, అనధికారులు, విద్యార్థులు మరియు ప్రజలందరు తప్పక హాజరు కావల్సినదిగా ఆహ్వానించుచున్నాము మరియు ఈ కార్యక్రమమును జయప్రదము చేయవలసినదిగా కోరుచున్నాము. పై ప్రకటనలో తెలిపారు.

## రేణిగుంట నూతన తహశీల్దార్‌గా జి. శ్యామ్ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



రేణిగుంట,మహి న్యూస్ ఏప్రిల్ 13: రేణిగుంట మండల నూతన తహశీల్దార్‌గా జి. శ్యామ్ ప్రసాద్ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన తహశీల్దార్ బదిలీ కావడంతో, వారి స్థానంలో ప్రభుత్వం శ్యామ్ ప్రసాద్‌ను నియమించింది.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా భూ సమస్యలు, పట్టాదారు పాస్ పుస్తకాలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా పారదర్శకంగా పని చేస్తానని పేర్కొన్నారు.

### సిబ్బందితో సమీక్ష

కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు ఇబ్బంది కలగకుండా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. నిబంధనల మేరకు పనులను వేగవంతం చేస్తామని భరోసా ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌కు మండల రెవెన్యూ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## 14న డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతి

గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 13 : డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు లాడ్జ్ సెంటర్ వద్ద డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారని అనంతరం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభా కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొంటారని, ప్రజలు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## సి.పి.టి అర్హతతో విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాగ్ టైపిస్ట్ పోస్టుల భర్తీ

గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 13 : ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాగ్ పోస్టులలో టైపిస్ట్ పోస్టులను డిగ్రీతో పాటు సి.పి.టి (కంప్యూటర్ ప్రొఫీషియన్స్ టెస్ట్) ఉత్తీర్ణులైన వారితో భర్తీ చేయుటకు అవకాశం కల్పించడం జరిగిందని విభిన్న ప్రతిభావంతులు శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరవణప్ప తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోస్టులకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. వివిధ శాఖలలో వివిధ కేటగిరిలకు రిజర్వు చేసిన 38 బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ బ్యాక్ లాగ్ ఉద్యోగాల మార్గదర్శకాలు, దరఖాస్తు నమూనా https://gunturap.in/dw2026 వెబ్ సైట్లో చూడవచ్చని తెలిపారు. వివరాలకు 0863 2323329 ఫోన్ నంబరుకు సంప్రదించవచ్చని చెప్పారు. డిగ్రీతో పాటు సి.పి.టి (కంప్యూటర్ ప్రొఫీషియన్స్ టెస్ట్) అర్హత కలిగిన అభ్యర్థులతో భర్తీ చేయుటకు జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కలెక్టరేట్ లో చలివేంద్రం ప్రారంభించిన కలెక్టర్

గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 13 : సోమవారం కలెక్టరేట్ ఆవరణలో చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తో కలిసి ప్రారంభించారు. పీజీఆర్ఎస్ కు విచ్చేసిన దరఖాస్తుదారులకు మజ్జిగ కూడా పంపిణీ చేశారు. వేసవి ఎండలు దృష్ట్యా కలెక్టరేట్ అవరణ లోని వివిధ శాఖల కార్యాలయాలకు వచ్చే సందర్శకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి సోమవారం చలివేంద్రంలో నీరు, మజ్జిగ పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. వేసవి ఎండలు తీవ్రత దృష్ట్యా రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ జారీ చేసిన ఆరోగ్య భద్రత సూచనలు ప్రతి ఒక్కరు ఖచ్చితంగా పాటించాలన్నారు.

### చేయవల్సిన పనులు

తీవ్రమైన ఎండలో బయటకు వెళ్ళినప్పుడు తలతిరుగుట, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వడదెబ్బగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎండ తీవ్రత తగలకుండా తలపై టోపి పెట్టుకోవాలని లేదా రుమాలు కట్టుకోవాలన్నారు. తెలుపు రంగు గల కాటన్ వస్త్రాలను ధరించడం శ్రేయస్కరం అన్నారు. ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు గాని, నిమ్మరసం గాని, కొబ్బరినీరు గాని త్రాగాలన్నారు. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రానిచో శీతల వాతావరణంలో దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని చెప్పారు. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ - ఓ ఆర్ యస్ కలిపిన నీటిని తాగించాలన్నారు.

### చేయకూడనివి

బాలింతలు, చిన్న పిల్లలు, వయో వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగరాదన్నారు. ఉదయం 10 గంటల నుండి




సాయంత్రం 4 గంటల మధ్యకాలంలో బయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనిని చేయరాదన్నారు. అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రావద్దన్నారు. ఎండలో నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు తీసుకోరాదని పేర్కొన్నారు. సూర్యకిరణాలకు, వడగాలికి గురికాకూడదన్నారు. ఎండలో గొడుగు లేకుండా తిరగరాదని సూచించారు. శీతలపానీయాలు, ఐస్ వంటివి తీసుకుంటే అనారోగ్యానికి గురి అయ్యే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, జిల్లా విపత్తుల నిర్వహణ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీ కుమారి, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ వి జ్యోతి బసు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు చెన్నయ్య, డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 22న జడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 13 : ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశము ఏప్రిల్ 22వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ సీఈవో జ్యోతి బసు నేడొక ప్రకటనలో తెలియజేశారు. ఏప్రిల్ 22వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ మీటింగ్ హాల్లో జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగే జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి కేంద్ర మంత్రివర్యులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, జిల్లా కలెక్టర్లు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని జిల్లా ప్రజా పరిషత్ సీఈవో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పి.జి.ఆర్.ఎస్ కు 447 అర్జీలు



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 13 : జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 447 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 189, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 178 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 5 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 23 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 44, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 8 అర్జీలు అందాయి సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలితో కలసి జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఆర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, లక్ష్మీ కుమారి, సి.ఆర్.డి.ఎ అధికారి డేవిడ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గా భాయి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 13 : జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకొని వారికి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎ. సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం అనంతరం నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎ.సిరిగారు, జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ వారి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలో భాగంగా వివిధ రకాలైన 11ప్రైవేటు కంపెనీలలో ఉన్న 650 ఖాళీలను భర్తీ నిమిత్తం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎమ్మిగనూరు లో ఏప్రిల్ 21వ తేది, ఉ.9:30 గం.ల నుండి సా.4గం.ల వరకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. సదరు జాబ్ మేళా లో పాల్గొనాలనుకునే యువతీ, యువకులు 18 సం.ల నుండి 35 సం.ల లోపు ఉండడంతో పాటు పదవ తరగతి నుండి డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, పిజి చదివిన వారు జాబ్ మేళాలో పాల్గొని ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. అందుకు గాను ముందుగా చీఱఅజూబఅఋఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ లింక్ లో సదరు వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. జిల్లా ఉపాధి అధికారిణి దీప్తి మాట్లాడుతూ... జాబ్ మేళాను యువత పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. జాబ్ మేళాలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్న నంబర్లకు సంప్రదించగలరని తెలిపారు. 7799494856, 9642735717 కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (ఇంచార్జి) చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, డి.ఆర్.డి.ఏ రమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి

## ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 13: అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ ను స్పష్టంగా ఇవ్వడం ఇవ్వాలని, ఒక వేళ సమస్య పరిష్కరించ లేకపోతే ఎందువల్ల సమస్యను పరిష్కరించలేకపోతున్నామో, పిటిషనర్లకు బాగా అర్థమయ్యేలా వివరించాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, గడువు ముగిసే వరకు చూడకుండా, ఆఖరి రోజు దరఖాస్తులను చూసి హడావుడిగా పరిష్కరిస్తే నాణ్యత ఉండదన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే పిటిషనర్లతో మాట్లాడాలన్నారు. రీఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ శాతాన్ని పూర్తిగా తగ్గించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడి ఉన్నామని, నిర్మాణాలను వేగవంతం చేసే దిశగా ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జలధార--జలహారతి కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళికకు సంబంధించి గ్రామ పంచాయతీ వారీగా పనులను గుర్తించి మ్యాపులతో సహా వెంటనే నివేదికలను అందించాలని జిల్లా కలెక్టర్ జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ అంశానికి సంబంధించిన శాఖలు సమన్వయంతో పనిచేసి, జిల్లాలో నీటి భద్రత, నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు కృషిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు తమ కార్యక్రమాలకు సంబంధించి ఆన్‌లైన్ డేటాతో పాటు శాఖల పనితీరులో ఎక్కడ బలంగా ఉన్నారు, ఎక్కడ బలహీనతలు ఉన్నాయో, ఇంకా ఎక్కడ దృష్టి పెట్టాలో స్పష్టంగా తెలియచేసేలా విశ్లేషణ నివేదికలను శుక్రవారం సాయంత్రం లోపు అందచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 14 వ తేదీన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ను పాటించాలని, ప్రోటోకాల్ అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డీఆర్వో, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు నారీ శక్తి వందన్ సమ్మేళనం

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 13: మహిళా సాధికారత, అభివృద్ధిని ప్రోత్సహించడం నారీ శక్తి వందన్ సమ్మేళనం ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. సోమవారం విజ్ఞాన్ భవన్, ఢిల్లీ నుండి నిర్వహిస్తున్న నారీ శక్తి వందన్ సమ్మేళనం కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా మహిళలకు సందేశం ఇస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా మహిళా నాయకత్వాన్ని పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆదోని వన్ స్టాప్ సెంటర్ లో వివిధ ఉద్యోగాల కోసం ఎంపికైన 12 మంది అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అందజేశారు. మహిళలపై హింసకు గురైన వారికి సమగ్ర సేవలు అందించేందుకు ఈ నియామకాలు ముఖ్యమని, ఎంపికైన సిబ్బంది వైద్య సేవలు, న్యాయ సహాయం, మానసిక కౌన్సిలింగ్, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలను బాధిత మహిళలకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు..వన్ స్టాప్ సెంటర్ లక్ష్యాలను సాధించడంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని, తమ విధులను నిబద్ధతతో, కరుణతో, వృత్తి నైపుణ్యంతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, సిడిపిఓలు , సూపర్వైజర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# సకాలంలో అంగన్వాడి కేంద్రాలకు బియ్యం పంపిణీ చేయాలి

## జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.



కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 13: జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాలకు బియ్యం సరఫరా సకాలంలో, నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కర్నూలు నగరంలోని సివిల్ సప్లై బఫర్ గోదాంను ఆయన సందర్శించి, ప్యాకింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేయబడుతున్న 3 కిలోల మరియు 25 కిలోల బియ్యం ప్యాకెట్ల తయారీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్యాకింగ్ విధానం, నాణ్యత ప్రమాణాలు, సరఫరా వ్యవస్థపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని 1886 అంగన్వాడి కేంద్రాలకు ప్రతి నెల సరఫరా జరిగే బియ్యం ప్యాకెట్ల తయారీ మరియు పంపిణీలో ఎలాంటి ఆలస్యం లేకుండా సమయపాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ లోపు ప్యాకెట్ల తయారీ పూర్తి చేసి, వెంటనే పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. ప్యాకింగ్ ఏజెన్సీ ప్రతినిధులతో, ప్యాకింగ్ నాణ్యత, తూకం సరైన విధంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్యాకింగ్ ఏజెన్సీ ను ఆదేశించారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత, సమర్థత పెంపొందించడంతో పాటు, ఎటువంటి లోపాలు చోటు చేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలకు సమయానికి సరఫరా జరిగితేనే గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు సరైన పోషకాహారం అందుతుందని పేర్కొంటూ, ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీ.ఎం ఎన్. వెంకట రాముడు, సంబంధిత సిబ్బంది మరియు ప్యాకింగ్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆవుల మృతి

# రైతుకు రూ.1 లక్ష సహాయం




నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 13:- రుద్రవరం మండలం భూమనాయుడుపల్లి గ్రామానికి చెందిన రైతు సుధాకర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు ఆవులను కోల్పోయినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా, సంబంధిత రైతుకు నష్టపరిహారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లోపం కారణంగా సుధాకర్ తన జీవనోపాధికి ఆధారమైన రెండు ఆవులను కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. సాధారణంగా వర్షాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తుల సందర్భంలోనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం వర్తిస్తుందని, ఈ ఘటనలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరుగా సహాయం అందించే అవకాశం లేదని తెలిపారు. అయితే, రైతు ఎదుర్కొన్న కష్టాన్ని పరిగణనలోకి తీసుకుని, పశుసంవర్ధక శాఖ నివేదిక ఆధారంగా జిల్లా యంత్రాంగం తరపున రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని తిరిగి జీవనోపాధిని సాధించుకోవాలని రైతుకు సూచించారు.

# వీబీ జీ రామ్ జీ కింద కూలీలకు 100 శాతం పనులు కల్పించాలి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 13: వీబీ జీ రామ్ జీ కింద కూలీలకు 100 శాతం పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఎంపిడిఓ లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి పిజిఆర్ఎస్, హౌసింగ్, జలధార - జలహారతి, వీబీ జీ రామ్ జీ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీబీ జీ రామ్ జీ కి సంబంధించి కూలీలకు పనులు కల్పించడంలో పురోగతి తీసుకొని రావాలన్నారు. కూలీలకు పనులు కల్పించడంలో పత్తికొండ, హాలహర్వి, మద్దికెర లాంటి మండలాలు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటున్నాయని, కోసిగి మండలం మాత్రం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోవడం ఏంటని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 3 రోజులలో కూలీలకు పనులు కల్పించడంలో పురోగతి తీసుకొని రాకపోతే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోసిగి ఎంపిడిఓ ను ఆదేశించారు. 140 గ్రామ పంచాయతీలలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ ద్వారా కూలీల అటెండెన్స్ లేదని, 3 రోజుల తర్వాత కూడా ఇదే విధంగా ఉన్నట్లైతే ఫీల్డ్ అసిస్టెంట్ ల మీద చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏ ఒక్క గ్రామ పంచాయతీ కూడా జీరో అటెండెన్స్ ఉండకూడదని కలెక్టర్ తెలిపారు. ఎండాకాలం కాబట్టి కూలీలు పని చేసే ప్రదేశంలో ఖచ్చితంగా షేడ్, నీళ్లు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడ కూడా సదుపాయాలు లేవనే ఫిర్యాదులు రాకూడదన్నారు. కూలీలు పని చేసే సమయం ఉదయం 6 నుండి 10 గంటల వరకు పెట్టుకోవాలన్నారు. అదే విధంగా ఉదయం 6 గంటలకు కూలీలు పని చేసే ఫోటోలు, క్షేత్రస్థాయిలో ఫీల్డ్ ఆఫీసర్ లు, టెక్నికల్ ఆఫీసర్ లు హాజరు అవుతున్నారో లేదో కంట్రోల్ రూమ్ నుండి మానిటర్ చేసుకోవాలని కలెక్టర్ డ్వామా పిడి ని ఆదేశించారు. గత వారం రిపోర్ట్ చేసిన లేబర్ సంఖ్యకు మరియు జనరేట్ అయిన పర్సంటేజీకి మధ్య వ్యత్యాసం ఉందన్నారు. తప్పుడు లేబర్ రిపోర్టింగ్ చేయకుండా, ఎంతమంది పనికి వచ్చారో అంతమంది వివరాలను మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.నియోజకవర్గ ప్రత్యేక అధికారులు నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులకు త్వరలోనే ముఖ్యమంత్రి గారితో సమీక్ష ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి గారు నియోజకవర్గాల వారీగా ర్యాంకులు ఇస్తారన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు కేవలం వారి శాఖ పరమైన కార్యక్రమాలే కాకుండా, నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులను పర్యవేక్షించాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులందరూ తమ నియోజకవర్గాల బడ్జెట్, తలసరి ఆదాయం, మరియు అభివృద్ధి సూచికలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జలధార - జలహారతి కార్యక్రమంలో భాగంగా మండలాల్లో ఉన్నటువంటి అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్ని పనులు గుర్తించారు? ఆ పనుల వివరాలు ఏమిటి? ఒక్కవేళ సర్ ప్లస్ నీళ్లు (అదనపు నీరు) ఏవైనా ఉంటే, వాటిని వేరే వాటికి మళ్లించే పనులు ఏవైనా గుర్తించారా? అని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీల వారీగా ఈరోజు సాయంత్రం లోపు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసి రేపటి నుంచి పనులు మొదలుపెట్టాలన్నారు.

ప్రతి గ్రామ పంచాయతీ వారీగా ఏ చెరువు నుండి ఏ చెరువుకు నీరు వెళ్తుంది, చెక్ డ్యామ్‌లు మరియు అదనపు నీరు వెళ్లే మార్గాల వివరాలు, నీటి ప్రవాహ దిశను సూచించే బాణం గుర్తులు, క్యాచ్‌మెంట్ ఏరియా వివరాలు మ్యాప్‌లో ఉండే విధంగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తాను గ్రామానికి వచ్చినప్పుడు ఎవరినీ అడగాల్సిన అవసరం లేకుండా, మ్యాప్ చూడగానే పనుల వివరాలు మరియు నీటి కనెక్టివిటీ అర్థం కావాలన్నారు. హౌసింగ్ కి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద పని దినాలు కల్పించడంలో పురోగతి తక్కువగా ఉందని, కౌతాళం మండలంలో పని దినాలు బాగా కల్పించారని, కోసిగి మండలం మాత్రం చాలా వెనుకబడి ఉన్నారన్నారు. సంబంధిత అంశంలో పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆప్షన్--3 కింద కాంట్రాక్టర్ లు నిర్మించిన ఇళ్లలో 2 వేల 522 ఇళ్లలో నిర్మాణ లోపాలను గుర్తించడం జరిగిందన్నారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కెపిఐ సూచికలలో భాగంగా ఈ సంవత్సరానికి 9,430 ఇళ్ల లక్ష్యం నిర్దేశించబడిందన్నారు. మొదటి త్రైమాసికంలో 2,350 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రణాళిక ప్రకారంగా రూఫ్ లెవెల్ లో ఉన్న వాటిని మొదటిగా పూర్తి చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మిగిలిన ఇళ్లను కూడా రూఫ్ లెవెల్ కి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హౌసింగ్ ఇంజినీర్ లను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, హౌసింగ్ పిడి చిరంజీవి, డ్వామా పిడి నరసింహా రెడ్డి, డీఆర్డీఏ పిడి రమణారెడ్డి, పిజిఆర్ ఎస్ నోడల్ అధికారి దీప్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు జవాబుదారీగా పనిచేయండి

## 100% ఫిర్యాదుల పరిష్కారం తప్పనిసరి




నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 13: జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి జవాబుదారీగా పనిచేస్తూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ముందు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో పరిష్కరించిన కొన్ని గ్రీవెన్సులు మళ్లీ రీఓపెన్ అవుతున్నాయని, అలాంటి కేసులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. ఇందుకు సంబంధించి వివిధ శాఖలకు సంబంధించిన 17 మంది అధికారులతో తాను సమీక్షిస్తానని తప్పనిసరిగా సంబంధిత పత్రాలతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత కోసం అధికారుల సమక్షంలోనే ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, వారి అభిప్రాయాలను నమోదు చేసి సీఎం కార్యాలయానికి నివేదిక పంపుతామని తెలిపారు. ప్రతి వారం జరిగే సమీక్షలకు ముందు 100 శాతం ఫిర్యాదుల పరిష్కారం జరగాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. పీజీఆర్ఎస్ నివేదికలపై ప్రత్యేక దృష్టి పెట్టి సంబంధిత వివరాలను నిర్దేశిత సమయంలో గా సమర్పించాలన్నారు. ఫిర్యాదుదారులకు ఎండార్స్‌మెంట్ ఇవ్వడం లేదా వారి వద్దకు వెళ్లి పరిష్కారం నమోదు చేయడం తప్పనిసరి అని తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి కార్యక్రమాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ కార్యక్రమాల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా ఐగాట్ "4-అవర్ లెర్నింగ్" కార్యక్రమాన్ని పూర్తి చేసి వెంటనే సర్టిఫికెట్లు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారుల హాజరు, పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ ఆదేశాల పట్ల నిర్లక్ష్యం సహించబోమని సూచించారు. పనితీరు ఆధారంగా మార్కులు ప్రకటిస్తామని తెలిపారు. అలాగే, కేపీఐల నమోదు, శిక్షణా కార్యక్రమాలు, సర్ప్రైజ్ తనిఖీలు, షోకాజ్ నోటీసుల జారీ వంటి అంశాల్లో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సెన్సస్ శిక్షణను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇటీవల బేతంచెర్ల మండలంలోని ఆర్. కృష్ణాపురం గ్రామ సచివాలయాన్ని సందర్శించిన సందర్భంగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నట్లు తెలిపారు. కొన్ని శాఖల సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తమవుతుండటంపై స్పందిస్తూ, బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని, హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్త బురుజు గ్రామ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి కనెక్షన్లు, మరుగుదొడ్ల నిర్మాణం, సీసీ రోడ్ల పనులను వేగవంతం పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ సదుపాయాల కల్పనలో జరుగుతున్న ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సంబంధిత శాఖలు సమన్వయంతో పని పెంచాలని ఆదేశించారు. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ డేకు వందల సంఖ్యలో ప్రజలు వస్తున్నందున, క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలని, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, జలధార--జలహారతి కార్యక్రమాలపై నిరంతర సమీక్ష ఉంటుందని, కె.సి కాలువ మరియు తెలుగు గంగ పనులను వేగవంతం చేయాలని, అవసరమైతే ఇతర పథకాల కింద కూడా పనులు చేపట్టాలని సూచించారు.

# అర్జీల పరిష్కారంలో 95% లక్ష్యం సాధించాలి



## పీజీఆర్ఎస్‌లో 296, రెవెన్యూ క్లినిక్స్‌లో 164 అర్జీల స్వీకరణ

నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 13:- ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని సకాలంలో, సమర్థవంతంగా పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలలో కనీసం 95 శాతం వరకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులకు స్పష్టంగా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీలను కేవలం ముగించడం కాకుండా, సమస్య మూలాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపడం అత్యంత ముఖ్యమన్నారు. ప్రతి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం అందించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. 95 శాతం పరిష్కార లక్ష్యాన్ని చేరుకోవడం ద్వారా త్వరలోనే 100 శాతం లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### ప్రీ-ఆడిట్ పురోగతి వివరాలు

ప్రీ-ఆడిట్ ప్రక్రియలో భాగంగా జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన మొత్తం 42,258 అర్జీలను పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. అందులో 30,798 (72.88%) అర్జీలను ప్రీ-ఆడిట్ చేయగా, వాటిలో 27,365 (88.85%) అర్జీలకు సరైన విధంగా పరిష్కారం చూపినట్లు వెల్లడించారు. అయితే 3,433 (11.15%) అర్జీలలో లోపాలు ఉన్నట్లు గుర్తించబడినట్లు పేర్కొన్నారు. ఈ లోపాలను తగ్గించి, పరిష్కారాల నాణ్యతను మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించడంలో విశేషంగా పనిచేసిన 10 మంది అధికారులను గుర్తించి కలెక్టర్ అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, బాధ్యతాయుతంగా వ్యవహరించిన అధికారులను ఆదర్శంగా తీసుకోవాలని ఇతరులకు సూచించారు. అదే సమయంలో, అర్జీలను నిర్లక్ష్యంగా పరిష్కరించిన లేదా సరైన విధంగా స్పందించని 10 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీజీఆర్ఎస్ నోడల్ అధికారిని ఆదేశించారు. ప్రజా సేవలో నిర్లక్ష్యానికి తావు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

### పీజీఆర్ఎస్ ద్వారా 296 అర్జీల స్వీకరణ

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పీజీఆర్ఎస్ ద్వారా మొత్తం 296 అర్జీలు స్వీకరించబడ్డాయన్నారు. ఈ అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, నిర్దిష్ట గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

### పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు

1)బండి ఆత్మకూరు మండలానికి చెందిన సయ్యద్ జీనత్ బీకు సంబంధించిన భూమిపై సివిల్ కోర్టు ద్వారా తీర్పు వెలువడిన నేపథ్యంలో, రాజారెడ్డి అనే వ్యక్తి ఆ భూమిలో 69 సెంట్లు ఆక్రమించాడని ఫిర్యాదు అందింది. ఈ విషయంపై ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి, హియరింగ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని బండి ఆత్మకూరు తహశీల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. 2) జూపాడుబంగ్ల మండలం బన్నూరు గ్రామానికి చెందిన రాణెమ్మ తనకు సర్వే నెం. 751-సి3లో భూమి ఉన్నప్పటికీ, ఆ భూమికి రహదారి (రాస్తా) సౌకర్యం లేకపోవడం, కాలువ సౌకర్యం కూడా లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అలాగే పారుమంచాల గ్రామంలో ఉన్న తన భూమికి కూడా ఇలాంటి సమస్యలు ఉన్నట్లు తెలియజేశారు. ఈ అంశాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని జూపాడుబంగ్ల తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. 3) జూపాడుబంగ్ల మండలం పారుమంచాల గ్రామానికి చెందిన సి. సురేష్, సర్వే నెం. 826/2లో 5 సెంట్లు, 826/3లో 5 సెంట్లు, 827/1లో 3.45 సెంట్ల భూమి ఉన్నప్పటికీ, వాటిని చుక్కల భూమిగా నమోదు చేస్తున్నారని పేర్కొంటూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. ఈ విషయంపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

### రెవెన్యూ క్లినిక్స్ - భూ సమస్యలకు సమగ్ర పరిష్కారం

భూ సంబంధిత సమస్యలను సమగ్రంగా, వేగంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి తక్షణ పరిష్కారం అందించే విధంగా ఈ క్లినిక్స్ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 164 అర్జీలు స్వీకరించబడ్డాయని, వాటిలో...రెవెన్యూ / గ్రామ-వార్డు సచివాలయ సేవలు -5, అడంగల్ సవరణలు - 33, చుక్కల భూములు ఌ 22-ఎ సమస్యలు - 28, అసైన్డ్ భూములు, ఆక్రమణలు -11, రెవెన్యూ కోర్టు / ఆర్ఓఆర్ అంశాలు - 30, సర్వే, రీ-సర్వే సమస్యలు - 48, దేవాదాయ, వక్ఫ్ భూములు - 9 వున్నాయని కలెక్టర్ వివరించారు.

## ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



రాయచోటి, మహి న్యూస్, ఏప్రిల్ 13: రాయచోటి పట్టణంలోని ఓ పాఠశాలలో సోమవారం యునాని వైద్యులు నూర్ అలీషా, హోమియో వైద్యులు సౌభాగ్య లక్ష్మి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 130 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. అనంతరం వైద్యులు నూర్ అలీషా, సౌభాగ్యలక్ష్మి లు మాట్లాడుతూ ఎండలో తీవ్రంగా ఉండడం వలన ఉదయం 10గంటలలోపు, సాయత్రం 5గంటల తర్వాత సమయాల్లో మాత్రమే బయటకు తీసుకువెళ్లాలన్నారు. అత్యవసరమై వెళ్లాల్సి వస్తే తలపై టోపీ లేక మెత్తడి దుస్తులు కప్పితీసుకువెళ్లాలన్నారు. చిన్నారులకు వేడి ప్రభావం తగిలితే వడదెబ్బ సోకే అవకాశం ఉంటుందన్నారు. వడదెబ్బ తగిలినవారిని వెంటనే స్థానిక ఆస్పత్రిలో చేర్చి సరైన సమయంలో వైద్య చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది వేణుగోపాల్, శశి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఆ నలుగురి పాత్రలో - మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



వైయస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు (మహి న్యూస్, ఏప్రిల్ 13) : ప్రొద్దుటూరు స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ నందు గుర్తుతెలియని వ్యక్తి మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా, వారు వెంటనే స్పందించి సోమవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబాహన్, ఈశ్వర్ వర్ధన్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, సుబ్బయ్య(బైక్ మెకానిక్) పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు. చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ, సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయం - ఎమ్మెల్యే వరద



వైయస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు (మహి న్యూస్, ఏప్రిల్ 13): ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఎల్లవేళలా కృషి చేస్తారని ఇందుకు ఆయన చేస్తున్న పలు కార్యక్రమాలే సాక్ష్యంగా ప్రజలకు చేరువవుతున్నట్లు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ప్రొద్దుటూరు స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు ఎమ్మెల్యే వరదకు నూతనంగా కేటాయించిన ఛాంబర్ నందు ఆయన మున్సిపల్ అధికారులతో ప్రజా సమస్యలపై చర్చించారు అలాగే పలు సమస్యలపై మున్సిపాలిటీకి వస్తున్న ప్రజల అర్జీలను స్వీకరించి వాటికి పరిష్కారం మార్గాన్ని సూచించారు.



## ప్రభుత్వాసుపత్రిలో తప్పని ఓపీ తిప్పలు



వైయస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు (మహి న్యూస్, ఏప్రిల్ 13): కడప జిల్లా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి తిప్పలు ఇక్కడికి వచ్చిన రోగులకు తప్పడం లేదు. 350 జిల్లా ఆసుపత్రిక ఉన్నప్పటికీ సరైన వైద్య సదుపాయాలు ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రి నందు అందటం లేదని రోగులు వాపోతున్నారు. ఓపి కోసం ఎక్కువసేపు వేచి ఉండడం, సరైన వసతి సౌకర్యాలు లేకపోవడం వలన రోగులు చాలాసేపు ఓపి క్యూ లైన్ లో నిలబడలేక పోతున్నారు. ఎండాకాలం గనుక రోగులు ఎక్కువ సమయం నిలబడలేక పోవడం, డాక్టర్ల కొరత ఉన్న పరిస్థితి ఇక్కడ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు నెలకొంది.



## ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో ఆలిండియా 6వ ర్యాంక్

### అద్వైత గురుకులం విద్యార్థిని చరిత ప్రతిభ.



గాలివీడు:ఏప్రిల్ 13(మహి న్యూస్): ఎడుహంట్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో అద్వైత గురుకులం విద్యార్థిని తన్నీరు.చరిత (9వ తరగతి) ఆలిండియా స్థాయిలో 6వ ర్యాంక్ సాధించింది. ఈ విషయాన్ని పాఠశాల చైర్మన్ ఇంద్రసేన, డైరెక్టర్ రామకృష్ణ వెల్లడించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన శ్రీనివాస రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలో భాగంగా ఇటీవల వెలువడిన ఫలితాల్లో చరిత అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఈ ఘనతను అందుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే విద్యార్థులు ఇలాంటి విజయాలు సాధిస్తున్నారని తెలిపారు.

## బోడే రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహారదీక్షకు మా సంపూర్ణ మద్దతు : జీవానందం



రాయచోటి, మహి న్యూస్ ఏప్రిల్ 13: బిసి నాయకులు బోడే రామచంద్ర యాదవ్ చేపట్టిన 'బిసి ధర్మ దీక్ష'కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎ.పి మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ జీవానందం తెలిపారు. సోమవారం రాయచోటిలో రాయలసీమ జిల్లాల మేధావుల ఫోరం నాయకులు పి.దేవేంద్ర, పెద్దన్న, శంకర్, వెంకటస్వామితో కలిసి ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి రక్షణ చట్టం, బీసీ కులాల కార్పొరేషన్ లకు నిధులు, సమగ్ర కులగణన,చట్టసభల్లో బీసీలకు 44% రిజర్వేషన్ల డిమాండ్లతో బోడే రామచంద్ర యాదవ్ చేపట్టిన ధర్మ దీక్షను మేధావుల ఫోరం పూర్తిగా బలపరుస్తోందని జీవానందం పేర్కొన్నారు. బిసిల హక్కుల సాధన కోసం జరిగే ప్రతి ప్రజాస్వామ్య పోరాటానికి తమ ఫోరం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## నూలివీడులో 40 గొర్రెల మృతి



గాలివీడు:ఏప్రిల్ 13(మహి న్యూస్): మండల పరిధిలోని నూలివీడు గ్రామంలో విషాద సంఘటన చోటుచేసుకుంది. టౌన్ సచివాలయం సమీపంలో పాడి రైతు ఆదినారాయణకు చెందిన 40 గొర్రెలు మృతి చెందాయి.ఈ ఘటనపై డిప్యూటీ డైరెక్టర్ డా. మాలకొండయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ శివారెడ్డి ఘటనాస్థలన్ని పరిశీలించి వివరాలు వెల్లడించారు. సోమవారం విషతుల్యమైన మేపు తినడం వల్లే గొర్రెలు మృత్యువాత పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ చేసినట్లు తెలిపారు. మృతి చెందిన గొర్రెల నమూనాలను పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపినట్లు పేర్కొన్నారు.పశువులను మేపు కోసం పొలాల వద్దకు తరలించే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. ఈ ఘటనపై వారు విచారం వ్యక్తం చేస్తూ, ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో గొర్రెలు మృతి చెందడం బాధాకరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యుడు నాగరాజు, ఎల్ఎస్ఏలు సురేష్, ఆకాష్ తేజ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



# క్షేత్ర స్థాయిలో గుర్తించిన సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలి..!

### వేసవిలో సీజనల్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మహి న్యూస్ ఏప్రిల్ 13 : అర్జీదారుల ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని.. క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి, అక్కడే పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ డా. నిధి మీనా, డిఆర్వో మల్లికార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర



ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయానికి కట్టుబడి ప్రతి శాఖ జిల్లా అధికారితో పాటు ఆయా శాఖల మండల స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను గుర్తించి స్థానికంగానే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారుల వినతులను మండల స్థాయిలోనే స్వీకరించి పరిష్కరించాలన్నారు. వేసవి మండుటెండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన పెంచాలన్నారు. అలాగే వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై.. ఆయా శాఖల అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్ శాఖలు.. ఆరోగ్యం,



పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పశువులకు తాగునీరు, పశు గ్రాసం కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేసవి తీవ్రతను అధిగమిస్తూ.. ఎక్కడా తాగునీటి కొరత లేకుండా పంచాయతీ, మున్సిపల్ శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో.. గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ బాధ్య అధికారులు పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు అందివ్వకూడదని, అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు.. సరైన, సూటి సమాధానం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో తహసీల్దార్లు, శాఖాధిపతులు ఎల్లపుడు పైస్థాయి అధికారులు, పిజిఆర్ఎస్ సిబ్బంది, ఫిర్యాదుదారులు సమాచారం అందిపుచ్చుకునేలా అందుబాటులో ఉండాలని, ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేసుకోవాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానాన్ని ఖచ్చితంగా అమలయ్యేలా సంబంధిత శాఖల జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని శాఖలు జిల్లా స్థాయి కార్యాలయం నుండి మండల, గ్రామ స్థాయి కార్యాలయాల వరకు.. అఫీషియల్ కరస్పాండెన్స్, ఉత్తర ప్రత్యుత్తరాలు, జీవోలు, మెమోలు, అన్ని రకాల కార్యకలాపాలకు సంబంధించి ప్రతి డాక్యుమెంట్ ను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించి.. ఆన్ లైన్ లో కార్యాలయ కరస్పాండింగ్ విధానం మరింత పటిష్టంగా, పారదర్శకంగా సాగాలన్నారు.





### ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు..

1) కలసపాడుకు చెందిన నెరేళ్ల జయలక్ష్మి.. తన భర్త వెంకట రమణ 2006 నుండి ఉపాధిహామీ పథకంలో ఈసీ గా పనిచేస్తూ బ్రెయిన్ స్ట్రోక్ తో 2024లో చనిపోయారని, తమ కుటుంబ పోషణ కోసం ఉపాధి/ ఉద్యోగం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. 2) కడపకు చెందిన ఎస్. శమా భాను... మాజీ సైనికుడు అయిన తన తండ్రికి ప్రభుత్వం ఇచ్చిన భూమిని వేరేవాళ్ళ ఆక్రమించికున్నారని... తమకు న్యాయం చేయలన్క్ జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. 3) వల్లూరు మండలానికి చెందిన షేక్ కరీమ్ తన ఇద్దరు పిల్లలకి ఆధార్ కార్డులు మంజూరు చేయాలని, అలాగే కుటుంబ సభ్యుల్లో పెద్దలకు ఓల్డ్ ఏజ్ పెన్షన్ వర్తింపజేయాలని పేషన్ పథకాన్ని అర్జీ సమర్పించారు. 4) అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన సరస్వతి.. తను రాజంపేటలో ఔరా లో శ్రీూ+ూ గా పని చేస్తున్నానని.. చంటి బిడ్డతో రోజు బస్సు ప్రయాణం ఇబ్బందిగా వుందని.. రాయచోటికి బదిలీ చేయాలని కోరుతూ కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. 5) కడప గంజికుంట కాలనీకి చెందిన షేక్ కరీమున్నిసా.. తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసిలు వెంకటేశ్వర్లు, జాన్ ఇర్విన్, డీసీవో వెంకట సుబ్బయ్య, కిరణ్ కుమార్, శివరామిరెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 15న జలధార అవగాహన కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలి..!


### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మహి న్యూస్ ఏప్రిల్ 13 : జలమే సంపద, జలమే జీవనాధారం.. అన్న సత్యాన్ని ప్రజలు గుర్తెరిగేలా.. 15వ తేదీన జలధార అవగాహన కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో.విధిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గుర్తెరిగి నీటి భద్రతా బాధ్యతలో.. సాగునీటి సంఘాలు కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపట్టాలని బద్వేలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా.. సోమవారం రాత్రి బద్వేలు ఆర్డీవో కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి.. 'జలధార.. నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత' అమలు ప్రణాళికపై ఈ నెల న్15న అవగాహన కల్పించే కార్యక్రమంపై.. సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో నీటి భద్రత అందరి బాధ్యతగా భవించాలన్నారు. నీటి భద్రత మన అందరి సమిష్టి బాధ్యత అని, ఈ విషయంలో జిల్లాలోని సాగు నీటి సంఘాల బాధ్యత అత్యంత కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.




నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టడం జరుగుతోందన్నారు. జలధార కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 15న ప్రతి గ్రామంలో జల చిత్రపటం ఆవిష్కరణ చేసి.. గ్రామంలో ప్రతీ ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తూ.. అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జలాధార కార్యక్రంలో నీటి వనరుకు సంబంధించి చర్చ జరగాలన్నారు. భూగర్భజల శాఖ వారు అందించే.. ఒక వాటర్ ఆడిట్ రిపోర్టు ఆధారంగా ప్రతి గ్రామంలో, గ్రామ సచివాలయంలో విలేజ్ టెక్నీకల్ అసిస్టెంట్ సహాయంతో.. జల వనరులకు సంబంధించి జల చిత్ర పటాన్ని తయారు చేయాలన్నారు. 15వ తేదీన ఉదయం 10 గంటలకు... జలాధార కార్యక్రమ ఉద్దేశ్యాన్ని చిత్రీకరించాలన్నారు. ఆ గ్రామంలో ప్రధాన నీటి వనరు, చెరువులు, కాలువల అనుసంధానం ఉందా, ఫీడ్ ఛానెల్స్ వున్నాయా ? అనే అన్ని అంశాలకు సంబంధించి.. రాంగోలి చిత్రంగా ఏర్పాటు చేసి.. గ్రామస్తులను ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల లాంటి భాగస్వాములతో ఈ తరహా కార్యక్రమాలను మరింత ప్రధాన్యతతో పటిష్టంగా చేపట్టాలన్నారు. అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు, వాగులు, చెరువుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం.. తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాగునీటి సంఘాలను పటిష్టం చేసే దిశగా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ కార్యాలయం నుండి ఆర్డీవో చంద్రమోహన్, డ్వామా, డీఆర్డీఏ, భూగర్భ జల, మైనర్ ఇరిగేషన్ సంబందిత అధికారులు హాజరవ్వగా... మండలాల నుండి డ్వామా సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో మాంసం దుకాణాల బహిరంగ వేలం

### 18 లక్షలకు వేలం దక్కించుకున్న సానేపల్లి రవీంద్రనాథ్ రెడ్డి



వైయస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు (మహి న్యూస్ ఏప్రిల్ 13): ప్రొద్దుటూరు, స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మటన్, చికెన్ మరియు చేపల దుకాణాలకు సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలం పాట ఉత్కంఠభరితంగా సాగింది.. మున్సిపల్ అధికారులు పర్యవేక్షించిన ఈ వేలం ప్రక్రియలో వ్యాపారస్తులు పాల్గొన్నారు. ప్రారంభ ధర ప్రభుత్వం నిర్ణయించిన సర్కారు వారి పాట.. కనీస వేలం ధర.8,00,000 లక్షల రూపాయలతో వేలం మొదలైంది. ముగింపు ధర వ్యాపారస్తుల మధ్య జరిగిన తీవ్రమైన పోటీ నడుమ, వేలం ధర అనూహ్యంగా పెరిగింది. చివరికి సానేపల్లి రవీంద్రనాథ్ రెడ్డి అత్యధికంగా 18 లక్షల రూపాయలు కోట్ చేసి ఈ వేలాన్ని కైవసం చేసుకున్నారు. మున్సిపల్ ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో పారదర్శకంగా ఈ వేలం నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి వేలం పాట ద్వారా మున్సిపాలిటీకి భారీ ఆదాయం సమకూరినట్లు తెలుస్తోంది. వేలం ప్రక్రియ ముగిసిన అనంతరం రవీంద్రనాథ్ రెడ్డిని తోటి వ్యాపారస్తులు అభినందించారు.

## పంచాయతీ ప్రత్యేక అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వరద



వైయస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు (మహి న్యూస్, ఏప్రిల్ 13) : ప్రొద్దుటూరు మండలం పరిధిలోని 15 పంచాయతీలకు సంబంధించిన పంచాయితీ ప్రత్యేక అధికారులతో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు సమావేశమైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరద మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో సరిపడినంత త్రాగు నీరు అందుబాటులో ఉంచడం, పారిశుధ్యం మెరుగుపరచడం, కరెంట్ సౌకర్యం, అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి.

## పుట్లంపల్లి చెరువు కట్ట రోడ్డు పనులకు భూమి పూజ లో పాల్గొన్నాటీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే మాధవి



కడప. మహిన్యూస్. ఏప్రిల్:13: కడపలో పుట్లంపల్లి చెరువు కట్ట రోడ్డు పనులకు భూమి పూజ చేసిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి మరియు ఎమ్మెల్యే మాధవి .కడప నగరం 15వ డివిజన్ పరిధిలోని పుట్లంపల్లి చెరువు కట్ట వద్ద రూ. 1.35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 2.5 కిలోమీటర్ల రోడ్డు పనుల భూమి పూజ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం నాణ్యమైన రోడ్ల నిర్మాణం చేపట్టడమే ప్రభుత్వ లక్ష్యమని, నిర్ణీత కాల వ్యవధిలో ఈ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి,స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు పుట్లంపల్లి ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.



## స్వచ్ఛ రథాలను ప్రారంభించిన మైదుకూరు ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్



మైదుకూరు. మహిన్యూస్. ఏప్రిల్:13: మైదుకూరు మండల పరిధిలో స్వచ్ఛత కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడానికి భాగంగా, మైదుకూరు ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర" లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని శుభ్రంగా, పచ్చగా తీర్చిదిద్దేందుకు గొప్ప ముందడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రారంభించిన ఈ స్వచ్ఛ రథాలు గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సరైన విధంగా నిర్వహించేందుకు ఉపయోగపడనున్నాయి. చెత్తను నిర్దిష్ట ప్రదేశాల్లో వేయడం, పర్యావరణాన్ని కాపాడడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఎమ్మెల్యే వివరించారు. ప్రజలు తమ ఇళ్లలోని వ్యర్థాలను ఈ రథాల ద్వారా సమర్పించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత ద్వారా వ్యాధులను నివారించవచ్చని, ఆరోగ్యవంతమైన జీవనానికి ఇది మొదటి అడుగు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com